Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 16.11.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 24 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## నింగి కెగసింది.. నేల మురిసింది

### జిఎస్ఎల్‌వి మార్క్3-డి2 గ్రాండ్ సక్సెస్

జిఎస్ఎల్‌వి... ఈ సిరీస్ అంటేనే ఇస్రో శాస్త్రవేత్తలకు ఎంతో టెన్షన్... దాని ప్రయోగం అంటేనే ఒకటే ఒత్తిడి. ఎందుకంటే పిఎస్ఎల్‌వి సిరీస్‌ను లొంగ తీసుకుని దానిని క్రమశిక్షణ బాటలో బుద్దిగా నడిపిస్తున్న 'ఇస్రో'కు ఈ జిఎస్ఎల్‌వినే ఇంకా మింగుడు పడడం లేదు. ఒక్కోసారి బుద్ధిగా వుంటూ చెప్పిన చోటకు వెళుతుంది. మరోసారి దారిమధ్యలోనే అడ్డం తిరుగుతుంది. అలాంటి టెన్షన్ మధ్యే ఈ నెల 14వ తేదీన నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగకేంద్రం నుండి మరోసారి జిఎస్ఎల్‌విని ప్రయోగించారు. అయితే ఈసారి మొండికేయలేదు సరికదా ఎంతో క్రమశిక్షణ పాటిస్తూ చెప్పిన చోటికి చక్కగా వెళ్లిపోయింది.

అంతరిక్ష ప్రయోగాలలో మరో చారిత్రాత్మక ప్రయోగానికి షార్ సెంటర్ వేదికైంది. 14వతేదీ సాయంత్రం 5.08గంటలకు (మిగతా 10వ పేజీలో)

● జగన్ కేసు..

## కట్టు కథలు ఆపండి...

# అసలు కథ తేల్చండి!



> ఘాటుగా స్పందించిన హైకోర్టు

> ప్రభుత్వానికి మొట్టికాయలు

*ప్రతిపక్ష నేత జగన్‌పై హత్యాయత్నం కేసు... రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే దీనిపై విచారణ జరిగితే ఒక్క అంగుళం కూడా ముందుకు కదలదు. జగన్‌పై దాడికి ప్రయత్నించిన నిందితుడు శ్రీనివాసరావు వరకే ఆగి పోతుంది. దీని వెనుక సూత్రధారులెవరు? పాత్రధారులెవరు? అన్న విషయం వెలుగుచూడదు.*

సంఘటన జరిగినరోజునే ముఖ్య మంత్రి చంద్రబాబు, డిజిపి ఆర్‌పి ఠాకూర్‌లు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లతోనే ఈ కేసు విచారణ ఏ విధంగా వుండబో తున్నది తెలిసిపోయింది. పోలీసులు విచా రించినా, సిట్ విచారించినా తేల్చేదేమీ వుండదు. అసలు కథ బయటకు రావడం జరగదు. ఇది వైసిపి నేతలకే కాదు, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసు.

జగన్ కేసును రాష్ట్ర పోలీసులతోనే మడతపెట్టేయాలనుకున్న చంద్రబాబు ప్రభుత్వానికి న్యాయస్థానంలో చుక్కెదు రైంది. కేసు విచారణను స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలంటూ బాధితుడిగా జగన్ హైకోర్టులో పిల్ దాఖలు చేయడం తెలిసిందే! దీనిని విచారించిన హైకోర్టు ఈ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తనపై హత్యా యత్నం కేసును స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలన్న జగన్ పిటిషన్‌పై తదుపరి విచారణలో హైకోర్టు తుది నిర్ణయం తీసు కునే అవకాశముంది. తదుపరి విచారణ వరకు సిట్ తన దర్యాప్తును కొనసాగించ వచ్చని కూడా కోర్టు స్పష్టం చేసింది. కేసు విచారణ సమయంలో కేసులోని వైఫల్యా లను, ప్రభుత్వ ప్రతినిధులుగా ముఖ్య మంత్రి, డిజిపిలు చేసిన ప్రకటనలను కూడా న్యాయమూర్తులు క్షుణ్ణంగా పరిశీ లించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీఎం, డిజిపిలు చేసిన ప్రకటనల వల్లే ఈ కేసుపై నిష్పాక్షిక దర్యాప్తు జరగదనే అనుమానం ఎవరికైనా వస్తుంది. అదే అనుమానం న్యాయమూర్తులకు కూడా కలిగి వుండొచ్చు.

కాబట్టి రేపైనా సరే హైకోర్టు స్వతంత్ర దర్యాప్తు సంస్థకు జగన్ హత్యకేసు విచా రణను అప్పగించే అవకాశాలే ఎక్కువగా వున్నాయి. మరోపక్క వైసిపి నేతల బృందం కూడా ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి జగన్‌పై హత్యాయత్నం కేసును స్వతంత్ర (మిగతా 10వ పేజీలో)

## పరిణితి చూపాడు.. ప్రశంసలు పొందాడు



● 40ఏళ్ళ అనుభవంకన్నా.. నాలుగు పదుల విజ్ఞత గొప్పదనిపించాడు

ఎవరు పొడిపించారు? ఎవరు ప్లాన్ చేశారు? వెనుక ఎవరి హస్తముంది? ఈ కుట్ర వెనుక పెద్ద తలకాయలున్నాయా?

(మిగతా 10వ పేజీలో)



ఇదీ.. ② కస్తూరిదేవి కథ

నాడు

ఓవైపు స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే.. మరోవైపు బాలికల చదువు కోసం పరితపించిన

## ఎందరో మహానుభావులు

12ఏళ్ళ నాడు చనిపోయిన ఓ ప్రముఖ మహిళ, ఇప్పుడు తమకు ఫోన్ చేశారంటూ...

## ఓ పాత పేపర్ అభూత కల్పనలు.. అబద్ధపు రాతలు!

నేడు

(6, 7 పేజీలలో)

# పొత్తుతో కాంగ్రెస్ ఖాళీ అయిపోతోంది



● వికటిస్తున్న టిడిపి కొత్త బంధం
● వరుసబెట్టి రాజీనామాలు చేస్తున్న నేతలు
● ఏపిలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోనున్న హస్తం

*ఆరోగ్యంగా వున్న మనిషి ఒక్కసారిగా కిడ్నీలు, లివర్, కళ్ళు, గుండె చెడిపోయి వెంటిలేటర్ మీద వుంటే ఎలా వుంటుందో... ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి అదే విధంగా తయారైంది. 2014 ఎన్నికలకు ముందు ఆంధ్రాలో కాంగ్రెస్ వికసించిన గులాబీలా వుండేది. ఎన్నికల తర్వాత వాడిన గులాబీ అయ్యింది. వాళ్ళు నెత్తికెత్తుకున్న విభజన అంశమే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు నిలువ నీడ లేకుండా చేసింది.*

2014 ఎన్నికల నాటికే కాంగ్రెస్‌ను వదిలేసి పెద్ద నాయకులందరూ అటు తెలుగుదేశంలోకో, ఇటు వైయస్సార్ కాంగ్రెస్‌లోకో వెళ్ళిపోయారు. అక్కడక్కడా మిగిలిన వాళ్ళు గత నాలుగున్నరేళ్ళుగా పార్టీలోనే కొనసాగుతూ వచ్చారు.

కాగా, నేడు ఆ పార్టీ టిడిపితో పొత్తు పెట్టుకోవడంతో అరకొర మిగిలిన నాయకులు కూడా కాంగ్రెస్‌ను వీడే పరి స్థితులొచ్చాయి. మాజీమంత్రులు వట్టి వసంతకుమార్, పి.బాలరాజు, మాజీఎమ్మెల్యే సి.రామ చంద్రయ్యలు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇక ఆ పార్టీలో వున్న ఒకే ఒక ప్రజాకర్షణ నాయకుడు మెగాస్టార్ చిరంజీవి కూడా రేపోమాపో కాంగ్రెస్‌ను వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంతకాలం రాష్ట్ర కాంగ్రెస్ సారధిగా బాధ్యతలు నిర్వర్తించిన రఘు వీరారెడ్డి కూడా తెలుగుదేశంతో పొత్తుపై మండిపోతున్నట్లు తెలుస్తోంది. ఆయన కూడా త్వరలో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పే అవకాశాలు లేకపోలేదు. ఈ దృష్ట్యా చూస్తే కాంగ్రెస్‌కు మిగిలివున్న అరకొర ఊపిరి కూడా 2019 ఎన్నికల తర్వాత ఆగి పోవడం ఖాయం.

# సీఎంఆర్‌లో దీపావళి డ్రా


విజేతకు బహుమతినందజేస్తున్న ముంగమూరు

నెల్లూరులోని చందన – సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఈనెల 11వతేదీన దీపావళి బంపర్‌డ్రాను నిర్వహించారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్‌లు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని బంపర్‌డ్రా విజేతలకు నెక్లెస్‌లు, మైక్రోఓవెన్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్‌లు, ప్రెషర్‌కుక్కర్ వంటి బహుమతులందజేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ షాపింగ్‌మాల్‌లో చలికాలానికి వాడుకునే దుప్పట్లు, బ్లాంకెట్స్, షాల్స్, జర్కిన్స్, మంకీక్యాప్స్‌పై భారీ డిస్కౌంట్లు ఇస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య కూడా పాల్గొన్నారు.

# రైఫిల్ షూటింగ్‌లో అదరగొట్టాడు



విద్యార్థిని సన్మానిస్తున్న కళాశాల ఛైర్మన్ డా. సత్యనారాయణ

పిల్లలు కాదు పిడుగులు అన్నట్లుగా ప్రొద్దుటూరులో గత నెల 24 నుండి 26 వరకు జరిగిన 64వ యస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి కళాశాల విద్యార్థి కె.యుజేనీ గాబె రిచ్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా. ఎన్. సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు విద్యార్థిని పుష్పగుచ్ఛాలతో అభినందించారు. డా. ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్నే కాక క్రమశిక్షణను కూడా పెంచుతాయన్నారు. విశ్వసాయి కాలేజీలో చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని నల్లజెర్లలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో అక్షిత శ్రావణ్యకు ప్రథమ స్థానం లభించిందన్నారు. కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో 'అపస్మా' ఆపన్నహస్తం


సభలో మాట్లాడుతున్న అపస్మా అధ్యక్షులు కృష్ణారెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపస్మా) నెల్లూరుజిల్లా సాధారణ సభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కాలేజీలో జరిగింది. ఈ సమావేశంలో అపస్మా రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఆపద వచ్చిన సమయంలో అపస్మా ముందుంటుందని, కేరళ వరద బాధితులకు కోటి రూపాయల సహాయం అందించామని, శ్రీకాకుళం తుఫాన్ బాధితులకు కూడా సాయం అందజేస్తున్నామని చెప్పారు. పదో తరగతిలో గ్రేడింగ్ విధానాన్ని తెచ్చిన ఘనత అపస్మాదేనన్నారు. అపస్మా రాష్ట్ర కోశాధికారి బాలాజీ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్స్ చిన్న ప్రైవేట్ స్కూల్స్‌ను దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని చదువును కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకట్రామయ్య, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీధర్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

కార్తీక సోమవారం సందర్భంగా జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసాయి. ఈనెల 12న నెల్లూరు నగరంలోని శివాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆది దంపతులు కొలువైన ఆలయాల్లో కైలాసవాసుడికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వర స్వామి, సంతపేట శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం, నవాబుపేట, ఉస్మాన్‌సాహెబ్ పేటలోని శివాలయాల్లో విశేషపూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు.

## నెల్లూరు కబుర్లు

• ఈ నెలలోనే రెండుసార్లు

# బాబు వస్తున్నాడు



ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 20వ తేదీన నెల్లూరుకు వస్తున్నాడు. ఈమేరకు పర్యటన ఖరారైంది. జిల్లాకు తుఫాన్ ముప్పు లేకపోవడంతో ఆయన పర్యటనకు అడ్డంకులు తొలగిపోయాయి. ఆరోజు నెల్లూరు, జాతీయ రహదారి పక్కన శ్రీ వేణుగోపాలస్వామి కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసే ధర్మపోరాట దీక్షలో ఆయన పాల్గొంటారు. ఈమేరకు మైదానంలో సభా వేదిక ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. అలాగే సర్వాంగసుందరంగా ముస్తాబైన జిల్లా పోలీసు కార్యాలయం ప్రారంభోత్సవంలో కూడా ఆయన పాల్గొంటారు.

ఈ నెలలోనే 28వ తేదీ మరోసారి ఆయన నెల్లూరుకు రానున్నారు. 'హౌస్‌ఫర్ ఆల్ స్కీం క్రింద నిర్మితమైన గృహ సముదాయాలను ఆరోజు ఆయన ప్రారంభించనున్నారు. ఈ పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సివుంది.

# నెల్లూరులో ఇందిరమ్మ శత జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న పనబాక కృష్ణయ్య

మాజీప్రధాని, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ శత జయంతిని ఈ నెల 19వ తేదీన నెల్లూరులో ఘనంగా నిర్వహించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. జిల్లా కాంగ్రెస్‌లో పెద్దనాయకులుగా మిగిలివున్న పనబాక కృష్ణయ్య, సి.వి. శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, ఉడతా వెంకట్రావ్‌లు 13వ తేదీ నెల్లూరు ఇందిరాభవన్‌లో విలేకరుల సమావేశం పెట్టి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇందిరమ్మ శత జయంతిని ఘనంగా ప్లాన్ చేశాం. ఈ ఉత్సవాలకు ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ఊమెన్ చాందీ, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఏఐసిసి కార్యదర్శి మెయ్యప్పన్, క్రిష్టఫర్, మాజీముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, మాజీఎంపీలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, కిల్లి కృపారాణి, కెవిపి రామ చంద్రారావు, కనుమూరు బాపిరాజు ముఖ్యఅతిథులుగా రానున్నారు. ఆరోజు ఇందిరా భవన్‌లో 101 కిలోల కేక్‌ను కట్ చేసి, 101 మంది పేదలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తాం. అలాగే జాతీయ సమైక్యతా 2కె రన్‌ను కూడా నిర్వహిస్తాం. ఈ రన్ ఇందిరాభవన్ నుండి మొదలై ఆర్టీసీ వరకు సాగుతుంది. ఈ శత జయంతి ఉత్సవాలకు జిల్లాలోని అన్ని మండలాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు, ఇందిరమ్మ అభిమానులు భారీగా తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.

# జర్నలిస్టులకు గృహావకాశం

అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు హౌసింగ్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటి డైరెక్టర్ ఎం.వెంకటప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాంత జర్నలిస్టులు ఆఫర్డబుల్ హౌసింగ్ ప్రోగ్రామ్ క్రింద 1200 చదరపు అడుగుల ఇళ్ళు నిర్మించుకునేందుకు ఈ స్కీం క్రింద అవకాశముందని, ఈ కార్యక్రమం కోసం ఏపిఆర్ఓ రవికుమార్‌ను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని ఆయన వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాక భౌతిక దరఖాస్తులను నెల్లూరులోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఇవ్వాలని, వివరాలకు 0861-2331179 నెంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## మండ్లకు
# మళ్ళీ నగర బాధ్యత

నెల్లూరు నగర బీజేపీ అధ్యక్షులుగా మండ్ల ఈశ్వరయ్యనే మళ్ళీ నియమించారు. ఈశ్వరయ్య ఇంతకుముందు కూడా ఇదే పదవిలో వున్నాడు. గతంలో బీజేపీ కార్పొరేటర్‌గా గెలిచివున్నాడు. పార్టీలో నమ్మకమైన మనిషి, కమలాన్ని అట్టే కనిపెట్టుకుని వున్న నిఖార్సయిన కార్యకర్త.

## సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో
# సర్వర్ సమస్య!

నెల్లూరులోని టౌన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అప్పుడప్పుడూ సర్వర్‌లు మొరాయిస్తుండడంతో రిజిస్ట్రేషన్‌లు ఆగిపోతున్నాయి. అమ్మకందారులు, కొనుగోలుదారులు తెగ ఇబ్బంది పడిపోతున్నారు. వినియోగదారులు ఫోటోలు దిగే సరికే తల ప్రాణం తోకకు వస్తోంది. సర్వర్ మొరాయించకుండా చర్యలు చేపడితేగాని రిజిస్ట్రేషన్‌లు సాఫీగా జరగవు.

## ముస్లింలను..
## ఉసిగొల్పుతున్న
# అజీజ్



నెల్లూరు నగరం సీటు నారాయణకే... అన్నప్పటి నుండి మేయర్ అజీజ్‌కు నిద్రపట్టడంలేదు. ముస్లింల కోటాలో నెల్లూరుసీటు తనకు వస్తుందని ఇంతకాలం ఆశ పెట్టుకుని వున్నాడు. ఇక్కడనుండి నారాయణే పోటీ చేస్తాడనడంతో ఇక ఆయన చంద్రబాబు వద్దకు పోయి గట్టిగా సీటు అడిగేయాలని అమరావతిలో తిష్ఠ వేశాడు. నగరం సీటును ఈసారి ముస్లింలకు ఇవ్వాలంటూ ముస్లిం నాయకుల ద్వారా ప్రకటనలిప్పిస్తున్నాడు. ముస్లింలతో ప్రత్యేకంగా సదస్సులు పెట్టించి ముస్లిం మైనార్టీలకు సీటు ఇవ్వాలనే నినాదం పుట్టిస్తున్నాడు. మరి నెల్లూరు టీడీపీలో మైనార్టీ వాదం ఎంత వరకు నిలుస్తుందో! జగన్ కాబట్టి ఆరోజు అజీజ్‌కు మేయర్ సీటిచ్చాడు. చంద్రబాబు అయ్యుంటే అది కూడా వచ్చేది కాదు.

# తుఫాన్‌కు సవాళ్ళు

తుఫాన్‌లు, వాయుగుండాలు అంటే జనం భయపడతారు. తుఫాన్ ముప్పు తప్పిందంటే ఊపిరి పీల్చుకుంటారు. అలాంటిది నెల్లూరుజిల్లా జనం తుఫాన్ కోసం మొహం వాచిపోయి వున్నారు. గతంలో వర్షాల కోసం పూజలు చేసేవాళ్ళు. ఇప్పుడు వాయుగుండాలు, తుఫాన్‌ల కోసం పూజలు చేసే పరిస్థితి లొచ్చాయి. వానల కోసం జనం అంతగా పరితపిస్తున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండాలు, తుఫాన్‌లు ఏర్పడితేనే గాని నెల్లూరు జిల్లాలో వర్షాలు కురవని దుస్థితి దాపురించింది. అందుకే తుఫాన్‌లకు భయపడడం లేదు. అంతేకాదు, నెల్లూరు–చెన్నైల మధ్య తీరం దాటుతాయనుకున్న తుఫాన్‌లు దిశ మార్చుకుని ఇంకో ప్రాంతానికి పోతే తెగ బాధపడిపోతున్నారు. సోషల్ మీడియాలో కూడా నెల్లూరు కుర్రాళ్ళు తుఫాన్‌లకు సవాళ్ళు విసురుతున్నారు. 'ఓ తిత్లి తుఫానా... నీకు దమ్ముంటే మా నెల్లూరుకు రా', 'ఓ గజ తుఫానా... నీకు సత్తావుంటే మమ్మల్ని గజగజ వణికించు'... అంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. వానల కోసం నెల్లూరీయులు ఎంతగా తపిస్తున్నారనేందుకు ఈ పరిస్థితులే ఉదాహరణ.

## విజయవాడలో
## తపాలా ఉద్యోగుల
# మహాసభలు

ఈ నెల 24, 25తేదీలలో విజయవాడలో అఖిలభారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన కరపత్రాలను ఈ నెల 11వ తేదీన నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని పోస్టాఫీసులో సంఘం నాయకులు దుడ్డు రమేష్ బాబు, ఆనంద్‌రావు, భాస్కర్, సతీష్, వెంకటేశ్వర్లు, శ్రీపతి తదితరులు ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ఎస్సీ, ఎస్టీ తపాలా ఉద్యోగులంతా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

# పల్లిపాడుకు పండుగొచ్చింది

- గాంధీ ఆశ్రమాన్ని హెరిటేజ్ సైట్స్ మిషన్‌లో చేర్చడానికి తీవ్రంగా కృషి చేస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



అరుణ్‌గోయల్‌కు వినతిపత్రం అందజేస్తున్న విపిఆర్

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో వున్న పినాకిని సత్యాగ్రహ ఆశ్రమాన్ని చరిత్రపుటలలో నిలిపే విధంగా చేయాలని పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంకల్పించారు. ఆయన కేవలం ఆలోచనకే పరిమితం కాకుండా దీనిని ఆచరణలో పెట్టడానికి కూడా కృషి చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే ఆయన ఇటీవల న్యూఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి అరుణ్‌గోయల్‌ను కలిశారు. దక్షిణ భారతదేశంలో వున్న ఏకైక గాంధీ ఆశ్రమం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమమేనని, 1921 ఏప్రిల్ 7వ తేదీన జాతిపిత మహాత్మాగాంధీ స్వయంగా ఈ ఆశ్రమాన్ని ప్రారంభించారని ఆయనకు వివరించారు.

ఈ ఆశ్రమంలో ఇంతవరకు చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని, అందుకే తాను సంసాద్ ఆదర్శగ్రామయోజన క్రింద ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందని ఆయనకు తెలిపారు. ఈ ఆశ్రమం అప్పట్లో స్వదేశీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో కీలకపాత్ర పోషించిందని, ఈ ఆశ్రమాన్ని హెరిటేజ్ సైట్స్ మిషన్‌లో చేర్చాలని, ఇరవై నాలుగు ఎకరాలలో విస్తరించిన ఈ ఆశ్రమంలో డిజిటల్ మ్యూజియం, ఫుడ్‌కోర్ట్, యాంఫీ థియేటర్ వున్నాయని, మౌలిక వసతుల కల్పనకు మూడు కోట్ల రూపాయలు మంజూరు చేయాలని వేమిరెడ్డి కోరగా, అందుకు అరుణ్‌గోయల్ సానుకూలంగా స్పందించారు.

# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా...

జాతిపిత మహాత్మాగాంధీ నడయాడిన ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గ్రామాన్ని ఆదర్శగ్రామ యోజన క్రింద పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దత్తత తీసుకున్నారు. ఈ నెల 19వ తేదీన జిల్లాస్థాయి అధికారులతో కలిసి ఆయన ఈ గ్రామాన్ని సందర్శించారు. తమ గ్రామంపై ఎంతో ప్రేమ చూపుతున్న విపిఆర్‌కు ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సభలో వేమిరెడ్డి



మాట్లాడుతూ సంసద్ గ్రామయోజన క్రింద పల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకున్నానని, రాష్ట్రంలోనే దీనిని ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, గ్రామంలో అన్ని మౌలిక వసతుల ఏర్పాటుకు 40 కోట్లకు పైగా వ్యయం అవుతుందని, వీటిని సాధించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిడిపిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికుల నుండి ఆయన విజ్ఞప్తులు స్వీకరించి, మీ సమస్యలన్నీ తీరుస్తానని వారికి హామీ ఇచ్చారు.

# ఎస్పీని కలిసిన విపిఆర్

- నగర సమస్యలపై చర్చ

నెల్లూరు నగరంలోని సమస్యలపై తన శైలిలో ప్రత్యేకశ్రద్ధ చూపుతున్న పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా ఎస్పీగా కొత్తగా వచ్చిన ఐశ్వర్యరస్తోగిని ఈ నెల 11న జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీతో నగరంలో ట్రాఫిక్, చైన్ స్నాచింగ్, ఈవ్‌టీజింగ్ వంటి సమస్యలపై మాట్లాడారు. ప్రజలకు భద్రత కల్పించే విషయంలో తన మన చూడొద్దని, నెల్లూరు అంటే సుఖశాంతులకు పేరని, ఆ పేరును కాపాడాలని ఆయన ఎస్పీకి సూచించారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, నేర నియంత్రణకు సిసి కెమెరాలు పెంచాలని, పోలీసుశాఖకు తనవంతు సహకారం వుంటుందని హామీ ఇచ్చారు. ఈ నెల 16, 17, 18తేదీలలో విఆర్‌సి మైదానంలో కార్తీక మాసం సందర్భంగా లక్ష దీపోత్సవానికి వేలసంఖ్యలో భక్తులు తరలి వస్తారని, భక్తుల భద్రతకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని విపిఆర్ కోరగా, ఎస్పీ తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు.



ఎస్పీ ఐశ్వర్య రస్తోగికి శుభాకాంక్షలు తెలుపుతున్న వేమిరెడ్డి

# రాష్ట్రమంతా చంద్రకాంతి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'చంద్రకాంతి' పథకాన్ని 14వ తేదీన వెంకటాచలంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఈ పథకం క్రింద ఇక మన రాష్ట్రంలో వీధిలైట్లు వెలగని ఊరే వుండదన్నారు. ప్రతి గ్రామంలో వీధిలైట్ల స్థానంలో ఎల్ఇడి బల్బులు అమరుస్తున్నారని, ఈ బల్బులతో విద్యుత్ ఆదా అవుతుందని, దేశ వ్యాప్తంగా 50లక్షల ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేస్తే ఒక్క మన రాష్ట్రంలోనే 25.50 లక్షల ఎల్ఇడి బల్బులు ఏర్పాటు చేయడం జరుగుతోందని సోమిరెడ్డి వెల్లడించారు.



జిల్లాలోని 938 పంచాయితీల్లో 70కోట్లతో 1.93 లక్షల ఎల్ఇడి బల్బులు ఏర్పాటు చేస్తున్నామని, దీని కోసం 17కోట్లతో 1129 కిలోమీటర్ల ప్రత్యేక వైరులైన్ వేస్తున్నామన్నారు. ఈ లైట్లకు పదేళ్ళ గ్యారంటీ వుందని, డిసెంబర్ చివరికల్లా అన్ని గ్రామాల్లో లైట్లు వేయడం పూర్తవుతుందని సోమిరెడ్డి పేర్కొన్నారు.

# జన్మభూమి సేవలో కెన్సెస్ నరసన్న

- స్వగ్రామంలో పాఠశాల నిర్మాణానికి భూరివిరాళం



కెన్సెస్ నరసారెడ్డి, సుధాకర్‌రెడ్డిలను సత్కరిస్తున్న మంత్రి పి.నారాయణ

కెన్సెస్ గ్రూప్ అధినేతగా అందరికీ సుపరిచితుడైన కొండ్లపూడి నరసారెడ్డి, వారి సోదరుడు కొండ్లపూడి సుధాకర్‌రెడ్డిలు స్వగ్రామంపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎంత ఎదిగినా, ఎక్కడున్నా జన్మభూమి కంటే మిన్న ఏదీ వుండదని తమ దాతృత్వంతో నిరూపించారు. నెల్లూరు రూరల్‌లోని కల్లూరుపల్లికి చెందిన నరసారెడ్డి పారిశ్రామికవేత్తగా చెన్నైలో స్థిరపడ్డారు. అయినా తన ఊరిపై మమకారం తగ్గలేదు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో హైస్కూల్ భవన నిర్మాణానికిగాను ఆయన తన సోదరుడు సుధాకర్‌రెడ్డితో కలిసి కోటి పాతిక లక్షల రూపాయలు విరాళం ఇచ్చారు. ఈ భవనానికి తమ తండ్రి కీర్తిశేషులు కొండ్లపూడి కృష్ణారెడ్డి పేరు పెట్టనున్నారు. ఈ నెల 9వ తేదీన మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణతో పాటు మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు విచ్చేసి ఈ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడమే కాకుండా, తమ దాతృత్వంతో ఒక మంచి విద్యాసంస్థ నెలకొల్పడానికి ముందుకు వచ్చిన కెన్సెస్ నరసారెడ్డి, సుధాకర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు.

# కావలికి సబ్‌కలెక్టర్ వచ్చాడు

- తొలి ఐఏఎస్ అధికారిగా శ్రీధర్



కావలికి తొలి సబ్‌కలెక్టర్‌గా చామకూరు శ్రీధర్ ఈ నెల 14వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఆర్డీఓగా వున్న ఇస్కా భక్తవత్సలరెడ్డిని తెలుగుగంగ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. డిసెంబర్ 31వ తేదీతో భక్తవత్సలరెడ్డి పదవీ విరమణ చేయనున్నారు. ఇక సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌ను అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నూతనకల్లు మండలం మద్దిరాల గ్రామంకు చెందిన శ్రీధర్ 2016లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. కొంత కాలం పాటు కేరళలో విధులు నిర్వహించి, ఆ తర్వాత ఏపి కేడర్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల శ్రీకాకుళంలో తిత్లీ తుఫాన్ బాధితులకు కూడా ఆయన సేవలందించారు.

జిల్లాలో ఇంతవరకు గూడూరుకు మాత్రమే సబ్‌కలెక్టర్ స్థాయి అధికారి వుంటూ వచ్చారు. ఇటీవల కొన్ని పట్టణాలకు సబ్‌కలెక్టర్ స్థాయి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ పట్టణాలలో కావలి కూడా వుంది. దీంతో తొలిసారి కావలికి ఐఏఎస్ అధికారిని సబ్‌కలెక్టర్‌గా నియమించారు.

# విపిఆర్ విద్యలో బాలల దినోత్సవం




నెల్లూరు, కనుపర్తిపాడులోని విపిఆర్ విద్య పాఠశాలలో 14వ తేదీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు, విపిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అలాగే విపిఆర్ విద్య కరస్పాండెంట్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ఇచ్చిన సందేశాల్ని పిల్లలకు వినిపించారు. నేటి బాలలే రేపటిపౌరులని, నెహ్రూ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని అత్యున్నత విలువలతో జీవితంలో ఎదగాలని వారు తమ సందేశంలో పిల్లలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.


## 'ప్రభా'తం

# విఫల ప్రయోగాలు!

**భా**రత రాజకీయ చరిత్రలో రెండు విభిన్న మార్గాలుంటాయి. ఈ దేశంలో జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా మనుగడ సాగిస్తుంటాయి. అయితే ఆ పార్టీల ఆలోచనాధోరణులు వేర్వేరుగా వుంటాయి. జాతీయ పార్టీల విధాన నిర్ణయాలు సువిశాల జాతి ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటే, ప్రాంతీయపార్టీల ఆచరణ, ఆలోచన అంతా కూడా తమ రాష్ట్రం, తమ ప్రాంతం, తమ బాషా అనే పరిధికే లోబడి వుంటుంది. ప్రాంతీయ ఆలోచనలు, ప్రాంతీయ సంకుచిత భావాలు, ప్రాంతీయ భాషాభిమానం వున్న నేతలు జాతీయ స్థాయిలో అధికారం చేపడితే, వాళ్ళు వాళ్ల ప్రాంతాల అభివృద్ధికి చూపించినంత శ్రద్ధ, దేశ ప్రయోజనాలపై చూపించరు.

దేశ రాజకీయ చరిత్రలో 'కూటమి' అన్నది ఒక విఫల ప్రయోగం. గతంలో ఎన్నోసార్లు ఇలాంటి ప్రయోగాలు విఫలమయ్యాయి. 1977లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడ్డ జనతా కూటమి అధికారంలోకొచ్చిన రెండోయేడాదే కుప్పకూలింది. 1989లో నేషనల్ ఫ్రంట్‌ను చూసాము. అది కూడా పట్టుమని రెండేళ్ళు నిలవలేదు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ బ్రతుకూ రెండేళ్ళే! 1998లో వాజ్‌పేయి నాయకత్వాన ఏర్పడ్డ ఎన్డీఏ మనుగడ కూడా 13నెలలే! 1996లో పి.వి.నరసింహారావు, 1999లో వాజ్‌పేయి, 2004 నుండి 2014వరకు మన్మోహన్‌సింగ్‌లు మాత్రమే పూర్తికాలం సంకీర్ణ ప్రభుత్వాలను నెట్టుకు రాగలిగారు. అయితే పూర్తికాలం నడిచిన ఈ ప్రభుత్వాలకు కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలే నేతృత్వం వహించడం గమనార్హం.

ప్రధాని నరేంద్రమోడీకి వ్యతిరేక కూటమి నిర్మాణమంటూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు దేశాలు పట్టి తిరుగుతున్నాడు. అన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలను కలుస్తున్నాడు. చివరకు కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి కూడా సిద్ధపడ్డాడు. దేశంలో ఎన్డీఏ, యూపిఏ కూటములు ఎప్పటినుండో ఉన్నాయి. దేశంలో ఒకే పార్టీకి సంపూర్ణ మెజార్టీ రావడం ఇక అసంభవం అన్నది ఎప్పుడో అర్థమైంది. అందుకే జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తమ సిద్ధాంతాలకు దగ్గరగా వున్న పలు జాతీయ, ప్రాంతీయ పార్టీలను కలుపుకుని కూటములు కట్టాయి. బీజేపీ వాళ్ళు ఎన్డీఏ అని పెట్టుకుంటే, కాంగ్రెస్ యూపిఏ అని పెట్టుకుంది. ఈ రెండు కూటములలో కూడా పెద్ద పార్టీలను ఇబ్బంది పెట్టే పార్టీలేవీ లేకపోవడంతో వీటి సంకీర్ణ పాలన సవ్యంగానే నడిచింది.



మోడీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలను ఏకం చేసి ఒకే వేదికపైకి తెస్తానంటూ చంద్రబాబు చేస్తున్న దండగ ప్రయత్నం ఎందుకోసం? ఎవరి కోసం? కేవలం జాతీయ రాజకీయాలలో తాను కూడా చక్రం తిప్పుతున్నానని చెప్పుకోవడానికి తప్పితే రెండో ఉపయోగం కనిపించడం లేదు. ఈయన మద్దతు కూడగడుతున్నానని తిరుగుతున్న పార్టీలన్నీ కూడా కాంగ్రెస్‌తో కలిసే వున్నాయి.

ఇప్పుడు మోడీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలను ఏకం చేసి ఒకే వేదికపైకి తెస్తానంటూ చంద్రబాబు చేస్తున్న దండగ ప్రయత్నం ఎందుకోసం? ఎవరి కోసం? కేవలం జాతీయ రాజకీయాలలో తాను కూడా చక్రం తిప్పుతున్నానని చెప్పుకోవడానికి తప్పితే రెండో ఉపయోగం కనిపించడం లేదు. ఈయన మద్దతు కూడగడుతున్నానని తిరుగుతున్న పార్టీలన్నీ కూడా కాంగ్రెస్‌తో కలిసే వున్నాయి. కర్నాటకలో జేడిఎస్, కాంగ్రెస్ కలిసే ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీల మధ్య స్నేహం 15ఏళ్ల క్రిందట నుండే వుంది. తమిళనాడులో డిఎంకె వుండేది యూపిఏలోనే! రేపు అవసరం, అవకాశాన్ని బట్టి డిఎంకె ఎన్డీఏతో కలిసినా కలవొచ్చు. యూపిలో కాంగ్రెస్, ఎస్పీ, బిఎస్పీ కలిసి ఇటీవలే ఉపఎన్నికల్లో పోటీ చేసాయి. వీళ్ళను కొత్తగా కలపాల్సిన పనిలేదు. ఇక వామపక్షాలు అన్నవి సైద్ధాంతికంగా బీజేపీకి వ్యతిరేకం కాబట్టి అవసరాన్ని బట్టి కాంగ్రెస్‌తోనే కలుస్తుంటాయి. దేశంలో ప్రతి జాతీయ, ప్రాంతీయపార్టీ అటు ఎన్డీఏలోనో, ఇటు యూపిఏలోనో వుంది. తటస్థులుగా వున్న కొన్ని పార్టీలు ఇప్పటికిప్పుడు ఏ కూటమిలో కూడా చేరబోవు. కాబట్టి చంద్రబాబు చేస్తున్న ఈ గోలంతా కూడా తన కోసమేకాని, ఇంకే విధంగానూ జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయబోదు.

దేశ ప్రయోజనాల కోసమే మోడీని దించాలనుకుంటున్నాం... ఇదే మోడీ ప్రత్యర్థుల ట్యాగ్‌లైన్. మోడీ ఈ నాలుగున్నరేళ్ళ పాలనలో దేశ ప్రయోజనాలు ఏఏ రూపాలలో దెబ్బతిన్నాయి? వీళ్ళు చూపించే మొదటి కారణం నోట్ల రద్దు. మరి పెద్దనోట్లను రద్దు చేయమని నరేంద్ర మోడీకి సలహా ఇచ్చిందే చంద్రబాబు కదా! నోట్ల రద్దు కమిటీకి ఆయనే ఛైర్మెన్ కూడా! అలాంటప్పుడు నోట్ల రద్దు వల్ల వచ్చే వైఫల్యంలో చంద్రబాబుకీ వాటా వున్నట్లే! మరి ఇక ఆయన దేశ ప్రయోజనం గురించి ఆలోచించేదెక్కడ? ఇక రెండో కారణం జిఎస్టీ. ఈ బిల్లు కాంగ్రెస్ హయాంలోనే రూపొందింది. మోడీ పార్లమెంటులో ఆమోదింపజేశాడు. కాంగ్రెస్‌తో సహా అన్ని పక్షాలు ఆమోదం తెలిపాయి. మరి ఆ బిల్లు జాతి ప్రయోజనాలను దెబ్బతీసేటట్లుంటే వీళ్ళంతా ఎందుకు మద్దతు తెలిపినట్లు?

ఈ కూటమిలో ఏ నాయకుడి చరిత్ర కూడా ఘనంగా లేదు. మాయావతి మీద అవినీతి కేసులున్నాయి, పశు దాణా కుంభకోణంలో లాలూ ప్రసాద్‌యాదవ్ జైల్లో ఉన్నాడు, దేవేగౌడ ప్రధానిగా ఉన్నప్పుడే ప్రాంతీయ పక్షపాతం చూపాడు, శరద్‌పవార్‌పై మహారాష్ట్రలో అవినీతి ఆరోపణలున్నాయి, ఇక చంద్రబాబుపై ఆరోపణల సంగతి సరేసరి! వీళ్ళలో ఎవరూ కూడా మోడీని మించినవాళ్ళు కాదు.! జాతి ప్రయోజనాల కోసమో, జాతీయ ప్రయోజనాల కోసమో వీళ్ళు కూటమి కట్టడం లేదు. కేంద్రంలో ఫలానా స్కాంలు జరిగాయనే కారణంతో కూడా మోడీని దించాలనుకోవడం లేదు. ఇక దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే గత యూపిఏ కంటే మోడీ ప్రభుత్వమే దేశ ప్రతిష్టను పెంచింది. దేశానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు లేని మోడీని ఓడించాలని వీరు చేసే కూటమి కుట్రల వెనుక సొంత ప్రయోజనాలు తప్పితే జాతి ప్రయోజనాలు, దేశ క్షేమం వంటి ఆలోచనలేవీ లేవు.

# నాగదేవతకు విశేష పూజలు



కార్తీక మాసం శుక్ల పక్షంలో వచ్చే నాగచతుర్థి, నాగపంచమి, నాగషష్టీ ఈ మూడు రోజులు నాగ పూజలు చేస్తారు. సర్ప దోషం, కాలసర్ప దోషం ఉంటే ఈ వ్రతం చేయడం ద్వారా తొలగిపోతాయి. ఈనెల 11న నాగుల చవితి సందర్భంగా వేలాదిగా మహిళా భక్తులు పాల్గొని పుట్టల వద్ద విశేషపూజలు, నోములు నోచుకున్నారు. నెల్లూరు, మూలాపేట ధర్మరాజులస్వామి దేవస్థానంలోని నాగులపుట్ట, పాత పెద్దాసుపత్రి వద్ద పొర్లుకట్ట ప్రాంతంలో వున్న నాగళ్ళ పరమేశ్వరి అమ్మవారి ప్రాంగణంలో వున్న నాగులపుట్ట, నిప్పో సెంటర్ వద్ద నున్న నాగేంద్రస్వామి పుట్ట, పొదలకూరురోడ్డు డైకస్ రోడ్డు సెంటర్ లోవున్న నాగులపుట్టల వద్ద మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పుట్టల చుట్టూ దారాలు చుట్టి కోడిగుడ్లను, పాలు పుట్టలో పోసారు. సజ్జలు, సలిపిండి నైవేద్యం పెట్టి నాగరాజస్వామికి పాటలు పాడి పూజలు నిర్వహించారు. నాగులపుట్ట పరిసర ప్రాంతాల్లో నిర్వాహకులు భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసారు.

### కామాక్షితాయి ఆలయంలో

# కార్తీక వెలుగులు



కార్తీకమాసం సందర్భంగా ఈనెల 9న జొన్నవాడ కామాక్షితాయి దేవాలయం మహిళా భక్తులు వెలిగించిన కార్తీక దీపాల వెలుగులతో శోభాయమానమైంది. పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చిన భక్తులు ఆలయంలోని ధ్వజ స్తంభాల వద్ద, నందీశ్వరుడు, శివలింగం, తులసికోట తదితర ప్రాంతాల్లోనూ, ఆలయ ప్రాంగణంలోనూ ఎంతో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. ఆ దీపాల వెలుగులో ఆలయం మరింతగా దేదీప్యమానమైంది. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకి సేవలు వైభవోపేతంగా నిర్వహించారు.

### వానలు కురవాలంటూ..

# వరుణయాగం

**- పర్యవేక్షించిన కమలానందభారతి స్వామీజీ**



వానలు పుష్కలంగా కురిసి పంటచేలు బాగా పండాలని, గ్రామాలన్నీ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అఖిలభారత హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పూజ్యశ్రీ కమలానందభారతి స్వామివారు ఈనెల9న కలిగిరి మండలంలోని గంగిరెడ్డిపాళెం పంచాయతీలో ఉన్న మార్తలవారిపాలెంలో అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని, మన ధర్మాన్ని మనం పరిరక్షించుకోవాలని గ్రామస్తులకు కమలానందభారతి ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి శివస్వామి, ఆలయ అర్చకులు భవాని శంకర శర్మ, వేదపండితులు శేఖరస్వామి, రమేష్‌శర్మ, అచ్యుతసాయి తదితరులు పాల్గొన్నారు.




## గుంటనక్కలన్నీ ఒకే గొడుగు కిందకు

నరేంద్ర మోడీ అనే సింహాన్ని ఎదుర్కోవడానికి దేశంలోని అవినీతి గుంటనక్కలన్నీ ఒకే గొడుగు కిందకు చేరుతున్నాయి. ఈ గుంటనక్కల టీమ్‌కు చంద్రబాబునాయుడు లీడర్. ఈ టీమ్‌లో ఎవరు కూడా నీతిమంతులు లేరు. అందరిలోకల్లా ధనిక సీఎం చంద్రబాబు. రాహుల్‌ది అత్యంత సంపన్న కుటుంబం. దేవేగౌడ, స్టాలిన్, శరద్‌యాదవ్‌లపై అవినీతి ఆరోపణలున్నాయి. చంద్రబాబు ఈ అవినీతిపరులందర్నీ ఏకం చేసి మోడీకి వ్యతిరేకంగా యుద్ధం చేస్తానంటున్నాడు. మోడీపై ఒక్క అవినీతి ఆరోపణ లేదు. నిజంగా ప్రజలు నీతి, నిజాయితీలను గెలిపించాలనుకుంటే మోడీని మళ్ళీ ప్రధానిగా చేసి ఈ గుంట నక్కల బ్యాచ్ కుయుక్తులను తిప్పి కొట్టాలి.

**- దామిశెట్టి సుజాత, నెల్లూరు.**

## నారాయణేమన్నా మరో సుందరయ్యా?

నెల్లూరు నగరం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా నారాయణ పోటీ చేస్తాడంటూ పత్రికలు గత కొద్దిరోజులుగా ఊదరగొడుతున్నాయి. నారాయణ ఏమన్నా మరో పుచ్చలపల్లి సుందరయ్యా? నెల్లూరు ప్రజల మంచి చెడ్డల కోసం ఆస్తులేమైనా దానం చేశాడా? ఇంకా చదువుల పేరుతో నెల్లూరు ప్రజల నుండే సంపాదించాడు. పదిమంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పినోడు కూడా కాదు. పేదోళ్ళమయ్యా అంత ఫీజులు కట్టలేమంటే ఫీజులు తగ్గించిన వాళ్ళు కూడా కాదు. కోట్లు ఖర్చుపెడతాడనే ఆయన పేరును ఇంతలా ప్రచారం చేస్తున్నారు. నెల్లూరు ప్రజలు డబ్బును చూసి నాయకులను ఎన్నుకునే రకం కాదు.

**బైనబోయిన వంశీకృష్ణ, నెల్లూరు.**

## శెభాష్ యోగీజీ

అలహాబాద్... అహ్మదాబాద్... హైదరాబాద్... ఔరంగాబాద్... ఎవరు వీళ్ళు. ఎక్కడివి ఈ పేర్లు. విదేశీ దురాక్రమణదార్ల పేర్లను ఇంకా మన నగరాలు, పట్టణాలకు పెట్టుకోవడమేంటి? మన దేశంలో ఈ పేర్లతో ఇంకా నగరాలున్నాయంటే అది మన బానిసత్వానికి చిహ్నాలు. ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ దమ్మున్న పని చేస్తున్నాడు. ఓట్ల బ్యాంకు రాజకీయాలు నడపడం లేదు. ప్రయాగరాజ్, అయోధ్య జిల్లా వంటి చారిత్రాత్మక పేర్లకు శ్రీకారం చుట్టారు. అలాగే మిగతా రాష్ట్రాల సిఎంలు కూడా యోగిని ఆదర్శంగా తీసుకుని మన దేశాన్ని దోచుకున్న దురాక్రమణదారుల పేర్లు తీసేసి రాజసం ఉట్టిపడేలా వుండే పాత పేర్లను పెట్టాలి.

**- సి.రాజీవి, నెల్లూరు.**



### • పొత్తు తెచ్చిన తంటా

# పాశంకు పనబాక సెగ!



కొన్నిరోజుల క్రితం పనబాక కృష్ణయ్య, లక్ష్మి దంపతులను తమ పార్టీలోకి రమ్మని ఆహ్వానించారు వైసిపి నాయకులు. ఇద్దరికీ సీట్లు కూడా ఇస్తామన్నారు. చేరడానికి కృష్ణయ్య సిద్ధమయ్యాడు కాని పనబాక లక్ష్మి మాత్రం వెనుకడుగేసింది. తనకు సోనియా గాంధీ వద్ద వున్న పరపతి దృష్ట్యా, భవిష్యత్‌లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తనకు మంచి భవిష్యత్ వుంటుం దనుకుని ఆమె వైసిపిలోకి రాలేదు. ఆమెతో పాటు ఇక కృష్ణయ్య కూడా కాంగ్రెస్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది.

అయితే, ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలోనూ అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెలంగాణలో మాదిరిగానే ఆంధ్రాలోనూ కలిసి పోటీ చేసేందుకు టీడీపీ, కాంగ్రెస్‌లు సిద్ధమయ్యాయి. ఏపిలో పెద్ద పార్టీ తెలుగుదేశం కాబట్టి, మిత్రపక్షంగా కాంగ్రెస్‌కు కొన్ని సీట్లు ఇవ్వాలి. ఇలా ఇచ్చే సీట్లల్లో పనబాక కృష్ణయ్యకు ఛాన్స్ వుండొచ్చని తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్‌కు ఏదైనా సీటు ఇవ్వాలనుకుంటే అది గూడూరే వుండబోతుంది. ఇది ఎస్సీ రిజర్వ్‌డ్ సీటు. వైసిపిలో గెలిచి టీడీపీలో చేరిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుంది. రేపు ఆయనకు సీటిచ్చినా ఓడిపోతాడనే ప్రచారం జరుగుతోంది. అందుకని కాంగ్రెస్ ఖాతాలో దానిని జమ వేయడానికి చంద్రబాబు ఏ మాత్రం ఆలోచించడు. ఇక కాంగ్రెస్‌కు కూడా అంతో ఇంతో కరెక్ట్ సీటు ఇదే! పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వున్న పనబాక కృష్ణయ్యే గూడూరు అభ్యర్థి అవుతాడు. స్థానికంగా పట్టున్న నాయకుడు. కాబట్టి కాంగ్రెస్ కూడా ఈ సీటునే కోరవచ్చు. కాంగ్రెస్ సింగిల్‌గా పోటీ చేస్తే 2014లో లాగే డిపాజిట్ కూడా రాదేమో గాని, తెలుగుదేశం పొత్తు మీద కాబట్టి గట్టిగా నిలబడొచ్చు. కృష్ణయ్య అభ్యర్థి అయితే వైసిపి అభ్యర్థిని బట్టి పోటీ తీవ్రత వుంటుంది! ఎటొచ్చి కాంగ్రెస్, టీడీపీల పొత్తు సునీల్ సీటుకు పొగపెట్టేటట్లుంది.

### • వెంకటగిరి

# బరిలో దిగిన రామనారాయణ



వెంకటగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొన్నిరోజుల పాటు నెల్లూరులోని తన ఇంటినే కేంద్రంగా చేసుకుని ఆ నియోజకవర్గ నాయకులతో సంప్రదింపులు జరిపాడు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల వైసిపి నాయకులు, అలాగే ఏ పార్టీలో వున్నోళ్ళయినా తన సన్నిహితులతో మండలాల వారీగా మాట్లాడుతూ వచ్చాడు. అందరు కూడా మీరు వస్తే మద్దతునిస్తామని, గట్టిగా పనిచేస్తామని హామీ ఇచ్చారు.

నాయకులను సెట్ చేసుకున్న ఆనం రామనారాయణరెడ్డి ఇక జనంలోకి వెళ్లాలికదా! అది కూడా కానిచ్చాడు. మొన్ననే పెంచలకోనలో 'వైయస్సార్ కాంగ్రెస్ విజయభేరీ' సదస్సు పెట్టి వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల నుండి భారీగా నాయకులు, కార్యకర్తలను తీసుకొచ్చి ప్రచారానికి శ్రీకారం చుట్టి బరిలో దిగాడు. వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో తిరగడం మొదలుపెట్టాడు. వెంకటగిరి ప్రజలతో సంబంధ బాంధవ్యాలున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వర్గీయులు కూడా ఆనంకు సంపూర్ణంగా సహకరిస్తుండడంతో ఆనం ప్రచారయాత్ర మంచి జోష్‌మీదుంది.

### ఆ సంఘటన..

# మళ్ళీ దగ్గర చేసింది!



**విష్ణుకు జగన్ ప్రేమపూర్వక పలకరింపు**

మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డికి ఎంతో ఆత్మీయ బంధం ఉంది. వై.యస్. సీఎం కాకముందే ఈ జిల్లాలో ఆయన అనుచరుడిగా, ఆయన వర్గీయుడిగా ముద్రపడ్డ రాజకీయ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి. అంతటి విశ్వాస పాత్రుడు కాబట్టే 2009 ఎన్నికల్లో కావలి నుండి విష్ణువర్ధన్‌రెడ్డికి సీటిస్తే ఓడిపోతాడని అందరూ చెప్పినప్పటికీ వై.యస్. అవేమీ పట్టించుకోకుండా విష్ణుకే సీటిచ్చాడు. అందరూ చెప్పినట్లే ఆ ఎన్నికల్లో విష్ణు ఓడిపోయాడు. వై.యస్. మరణం తర్వాత కొంతకాలానికి విష్ణు వైసిపిలోకే వచ్చాడు. 2014 ఎన్నికల్లో కావలి వైసిపి టిక్కెట్ తెచ్చుకున్న రామిరెడ్డి ప్రతాప్ గెలుపు కోసం పని చేశాడు. కాని వచ్చే ఎన్నికల్లో మాత్రం కావలి సీటు తనకే ఇవ్వాలంటూ మొండిపట్టు పట్టి వున్నాడు. ఈ విషయంలో రెండేళ్ళ క్రితమే జగన్‌తో నిష్ఠూరంగా మాట్లాడి వున్నాడు. ఈ విషయంలో విష్ణుకు నచ్చజెప్పాలని రాష్ట్ర, జిల్లా వైసిపి నాయకులెవరు ప్రయత్నించినా విష్ణు వినిపించుకోలేదు. టిక్కెట్ విషయంపైనే ఆయన అలిగి వున్నాడు. జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర మొదలుపెట్టి ఏడాదైంది. జిల్లాలో అందరు నాయకులు పలు చోట్ల పలుసార్లు జగన్‌ను కలిసారు. కాని విష్ణు కలవలేదు.

అయితే విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్‌పై హత్యాయత్నం జరగడం, ఆయన హైదరాబాద్‌లో చికిత్స తీసుకుని విశ్రాంతిలో వుండడంతో విష్ణు ఇటీవల హైదరాబాద్ వెళ్లి జగన్‌ను పరామర్శించాడు. విష్ణును చూసిన జగన్... పోనీలేదన్న ఈ విధంగా నన్నా నన్ను చూడ్డానికి వచ్చారని అనడంతో... విష్ణుకు బాధగా అనిపించిందంట!

# స్మగ్లర్... బ్రోకర్

**కాకెత్తుతున్న నెల్లూరు రాజకీయం**





***జిల్లా రాజకీయాలలో విమర్శల సెగ మొదలైంది. నాయకులు తమ భాషా పాండిత్యాన్ని ప్రదర్శించడంలో పోటీలు పడుతున్నారు. నువ్వు ఒకటంటే నేను నాలుగంటా... అన్నట్లు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు.***

వెంకటగిరి నియోజకవర్గంలో పర్యటించిన వైసిపి ఇన్‌ఛార్జ్ ఆనం రామనారాయణరెడ్డి తాను వచ్చే ఎన్నికలలో ఒక స్మగ్లర్‌తో పోటీ పడనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణనుద్దేశించి విమర్శలు చేశాడు. దీనిపై నెల్లూరులో వున్న నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్పందించాడు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆనం కుటుంబంపై విరుచుకుపడ్డాడు. ఆనం రాజకీయ స్మగ్లర్, ఆనం కుటుంబమంతా వెన్నుపోటు చరిత్రే! వాళ్ళు ఎన్టీఆర్‌కు ద్రోహం చేశారు. చేరదీసిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని వెన్నుపోటు పొడిచారు. రాజకీయంగా, ఆర్థికంగానూ ఎదగడానికి కారణమైన వై.యస్.రాజశేఖరరెడ్డి కొడుకు జగన్‌నే ఉరితీయాలన్నాడు. ఈరోజు జగన్ పక్కన చేరి నిన్నటి వరకు టీడీపీలో ఎంతో ప్రాధాన్యతనిచ్చిన చంద్రబాబునే నరకాసురుడంటున్నాడు. వచ్చే ఎన్నికల్లో వెంకటగిరి ప్రజలే ఆనం రామనారాయణరెడ్డికి బుద్ధి చెబుతారంటూ తనదైన స్టైల్‌లో రెచ్చిపోయాడు.

దీనికి కౌంటర్‌గా ఆపక్కరోజే కార్పొరేటర్, వైసిపి నాయకుడు ఆనం రంగ మయూర్‌రెడ్డి కార్పొరేషన్ వైసిపి ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, వైసిపి నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లులతో కలిసి ఏ.సి సెంటర్‌లో విలేకరుల సమావేశం పెట్టాడు. కోటంరెడ్డి శీనయ్యపై తన లెవల్లో ధ్వజమెత్తాడు. హర్షిణి ఫైనాన్స్ పేరుతో ప్రజల సొమ్మును కాజేసి పరారైందెవరు? గండిపేట నాచారంలో ఎన్టీఆర్ ప్రచారరథంలో సొమ్ము దొంగిలించిందెవరు? బాలకృష్ణ సినిమాలకు బ్లాక్ టిక్కెట్లు అమ్ముకున్నదెవరు అంటూ శీనయ్య నుద్దేశించి విమర్శలు చేశాడు. గతంలో పండుగల పేరు చెప్పుకుని బాలాజీ నగర్‌లో చందాలు వసూలు చేసుకునే శీనయ్య నుడా పదవి వచ్చాక తడ నుండి కావలి దాకా జోలె పట్టుకుని లేఅవుట్ల యజమానులను బెదిరిస్తూ దండకాలు సాగిస్తున్నాడని మయూర్ ఆరోపించాడు.

మొత్తానికి జిల్లా రాజకీయాలలో విమర్శలు, పరుషపదాల తుఫాన్ మొదలైంది. ముందుముందు ఇది ఇంకెంత తీవ్ర రూపం దాల్చనుందో?!

# రఫ్ ఆడిస్తున్న రస్తోగి!



**పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయ్యింది నెల్లూరుజిల్లా పోలీసు పరిస్థితి. పనిలో పిప్పి తీసి వదిలేసిన పి.హెచ్‌డి రామకృష్ణ ఈ జిల్లాను వదిలి పోయాడని సంతోషించే లోపే కొత్తగా వచ్చిన ఐశ్వర్య రస్తోగి బెండు తీయడం మొదలుపెట్టాడు.**

కొత్త ఎస్పీ ప్రభావం జిల్లా పోలీసు శాఖలోనే కాదు, నెల్లూరు రోడ్ల మీద కూడా అప్పుడే కనిపిస్తోంది. నేరం జరిగాక నేరపరిశోధనలు జరిపి నేరస్తులను పట్టుకోవడం కంటే కూడా ఆ నేరాలు జరగకుండా చూడడంపైనే ఆయన ప్రధానంగా దృష్టిపెట్టినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా నగరంలో ఏ నిముషంలో ఏ ప్రాంతంలో చూసినా పోలీసులు కనపడేలా చేశాడు. ఇందుకు ఏఆర్ పోలీసు సిబ్బందిని కూడా వాడుకోవడం సరికొత్త ఆలోచన. ఎందుకంటే పోలీసు స్టేషన్‌లలో వున్న సిబ్బందితోనే అన్నిరకాల పనులు చేయించాలంటే కుదరదు. అదనపు సిబ్బంది కావాల్సిందే! అందుకే రస్తోగి నేరాల నియంత్రణ కోసం ఏఆర్ సిబ్బందిని వాడుకుంటున్నారు. పోలీసు సిబ్బందికి ఏఆర్ సిబ్బందిని జత చేసి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఏఆర్ పోలీసులు మిలటరీ యూనిఫాంలో రోడ్లపై తిరుగుతున్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈవ్‌టీజర్లపై పోలీసులు విరుచుకుపడుతున్నారు. చైన్ స్నాచర్లు రోడ్ల మీదకు రావడం లేదు. బండ్ల తనిఖీ ముమ్మరంగా వుండడంతో రోడ్ల మీద ఆకతాయిల సాహస ప్రదర్శనలు కూడా ఆగిపోయాయి. ఇదే పోలీసింగ్ విధానాన్ని కొనసాగిస్తే నగరంలో పరిస్థితులు బాగుంటాయి.



## ఓ వైపు స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ.. మరోవైపు బాలికల చదువు కోసం పరితపించిన

# ఎందరో మహానుభావులు

### విద్యాలయానికి శాశ్వత నివేశన కోసం భూముల కొనుగోలుకు సంకల్పం :

1928లో జరిగిన శ్రీ కస్తూరిదేవి విద్యాలయం కార్యనిర్వాహక సభలో ఈ విద్యాలయానికి శాశ్వత నివేశనము అవసరమవడం చేత నెల్లూరు నగరంలోని కాసుఖేల అగ్రహారానికి తూర్పున ఉండే పొలాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. అక్కడ గొర్రె కామాక్షమ్మ, గొర్రె సుబ్బయ్య, గొర్రె శేషయ్య, గొర్రె సుబ్బరామయ్యలకు చెందిన స్థలాన్ని ఎకరా ఒక్కింటికి 2వేల రూపాయల ధరకు మించకుండా భూమిని కొనుగోలు చేయాలనుకున్నారు. అయితే, ఆ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు విద్యాలయం వారి వద్ద ధనం లేకపోవడంతో ఆ స్థలాన్ని కమిటీ నిర్వాహకులైన కె.వి రాఘవాచార్యులు, తిక్కవరపు వెంకట రామిరెడ్డిగార్ల పేర్లతో విక్రయపత్రం రాయించుకుని, వారే విక్రయధనం చెల్లించి ఆ పొలానికి యావత్ హక్కు అనుభవదారులుగా ఉండాలని, విక్రయం చేసిన తేది మొదలు ఆరునెలల కాలంలోగా వీరికి విద్యాలయం వారు విక్రయధనం అసలు ఫాయిదాలు ఖర్చులు, సర్కారు శిస్తులు చెల్లించిన యెడల వారు విద్యాలయం కమిటీవారికి ఆ భూమిని విక్రయించి దస్తావేజు రాయించి ఇవ్వాలని తీర్మానించారు.

1929 మార్చి 21న కాసుఖేల అగ్రహారంలోని గొర్రె శేషయ్య కుటుంబానికి చెందిన సుమారు 2 ఎకరాల 16 సెంట్లలో 2 ఎకరాలు మాత్రం శ్రీ కస్తూరిదేవి విద్యాలయానికి ఒక ఎకరాకు 2వేల రూపాయలకు మించని ధరకు కొనుగోలు చేయాలని, అందుకు అవసరమైన అగ్రిమెంట్లు దస్తావేజులు రాయించుకోవాలని తీర్మానించారు. 1929లో అప్పుడున్న కమిటీలో కెవి రాఘవాచార్యులు, బెజవాడ సుందరరామిరెడ్డి, పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి, తిక్కవరపు వెంకట్రామిరెడ్డి, ఓరుగంటి వెంకటసుబ్బయ్య, రాళ్ళపల్లి రామసుబ్బయ్య, శ్రీమతి పొణకా కనకమ్మ, పొణకా పట్టాభిరామరెడ్డి ఉన్నారు. దాతల నుంచి, ప్రజల నుంచి వచ్చిన విరాళాలు, చందాలతో ఆ భూమిని కొనుగోలు చేయడం జరిగింది.

### మహాత్మాగాంధీజీ చేతుల మీదుగా శిలాఫలకం

అందరూ అనుకున్నట్లుగానే, ఎంతో కష్టపడి కృషిచేసి బాలికల పాఠశాలకు స్థలం కొనుగోలు చేశారు. 1929లో జాతిపిత మహాత్మాగాంధీజీ ఆంధ్రా పర్యటనలో ఉన్నప్పుడు గాంధీజీ చేతుల మీదుగా శ్రీ కస్తూరిదేవి బాలికల పాఠశాలకు శిలాఫలకం వేశారు. బాపూజీ చేతులమీదుగా ఈ బాలికల పాఠశాలకు శిలాఫలకం వేయడం జిల్లా చరిత్రలోనే ఒక అపూర్వమైన సంఘటనగా ప్రఖ్యాతి చెందింది. జాతీయ భావాలతో, ఉన్నతాదర్శాలతో, బాలికలకు విద్య బోధించడం ద్వారా వారి జీవితాలకు వెలుగులు ప్రసాదించవచ్చనే ప్రగాఢ విశ్వాసంతో ఆనాడు సమాజ శ్రేయోభిలాషులు.. మహానుభావులందరూ కలసి ఈ విద్యాలయానికి జీవం పోశారు. ఈ మహాయజ్ఞంలో నాడెంతో మంది తమవంతు చేయూత, సహాయ సహకారాలు అందించి తమ ఉదారతను, సమాజ సేవాభావాన్ని చాటుకున్నారు. అయితే, దురదృష్టవశాత్తూ 1930 ప్రాంతాల్లోనే ఈ పాఠశాల మూతపడింది. ఈ విద్యాలయానికి సంబంధించిన స్వాతంత్ర్యోద్యమకారుల్లో కొంతమంది సత్యాగ్రహోద్యమంలో జైలు పాలవడంతో, పాఠశాల నిర్వహణ కష్టతరమైంది. ఆ తర్వాత మళ్ళీ 1944 నాటికి రాజకీయ వాతావరణం బాగా మారింది. దీంతో ఈ విద్యాలయాన్ని పునఃప్రారంభించాలనే ఆకాంక్ష వారిలో కలిగింది. మళ్ళీ ఈ విద్యాలయం ప్రారంభానికి వారెంతగానో పట్టుదలతో, దీక్షతో కృషి చేసి అనుకున్నది సాధించారు.

### హైస్కూలు స్థాపనకు కృషి...

"కస్తూరిదేవి విద్యాలయము స్థలములో బాలికా విద్యాలయమును ప్రారంభించి ప్రభుత్వపు రికగ్నైజేషన్ చేయించుటకు ఆ స్థలము చాలడం లేదు కనుక, హైస్కూలును స్థాపించేందుకు సుమారు 8 ఎకరాలకు తక్కువ లేకుండా స్థలము కావలసి వున్నది. చుట్టుపక్కల సదరు భూమిలో కలిపే అనుకూలమైన ప్రదేశమేదీ దొరికేట్టు లేదు. ఇట్టి సందర్భమున సదరు హైస్కూలు నిర్మాణమునకు గాను కొంతభాగము భూమిని విక్రయించి గానీ, లేదా మార్చుకొని గానీ స్థలము సంపాదించవలసిన అవసరము ఏర్పడింది. ఆ తర్వాత, కస్తూరిదేవి విద్యాలయం కమిటీవారు విద్యాలయం స్థలాలను 22 ప్లాట్లుగా చేసి వాటిలో 11 ప్లాట్లను విద్యాలయానికి, మరో 11ప్లాట్లను రేబాల పట్టాభిరామరెడ్డికి కేటాయించారు. పట్టాభిరామిరెడ్డిగారికి ఇచ్చిన 11ప్లాట్లకు బదులుగా ఆయన తన సొంత స్థలమైన 17ఎకరాల 10సెంట్లను స్థలమార్పిడి పత్రము ద్వారా ఈ పాఠశాలకు రాయించి ఇచ్చారు. 24-4-1945లో నిర్వహించిన వేలానికి సంబంధించి అప్పటి కమిటీ కార్యదర్శి రేబాల దశరధరామిరెడ్డి 10-4-1945న రెండు పత్రికల్లో ఆ మేరకు వేలం ప్రకటన కూడా ఇచ్చారు. అదే ప్రకటనలో "నావి 11 ప్లాట్లు గూడా".. అదేరోజున వేలం ద్వారా విక్రయిస్తామంటూ, రేబాల పట్టాభిరామిరెడ్డి ప్రకటించారు.

అనంతరం జరిగిన వేలంలో... కస్తూరిదేవి విద్యాలయానికి చెందిన 11 ప్లాట్లను వేలం వేశారు. ఆ ప్లాట్లను నెల్లూరుకు చెందిన ఏ.వి రమణయ్య 2 పాట్లు, నెల్లూరు నివాసి వారణాసి రామయ్య, గాజులపల్లె ఆదిశేషశర్మ, చినచెరుకూరుకు చెందిన వేమారెడ్డి రామరాఘవరెడ్డి, గూడూరు వెంకట్రామిరెడ్డిలు ఒక్కొక్కటి వంతున మొత్తం 4 ప్లాట్లు, పెదచెరుకూరుకు చెందిన మనుబోలు ఆదినారాయణరెడ్డి 2ప్లాట్లు, నెల్లూరుకు చెందిన మన్నెం శ్రీనివాసులురెడ్డి 3 ప్లాట్లు మొత్తం కలసి 11 ప్లాట్లను వేలంద్వారా కొనుగోలు చేసుకున్నారు.

ఇదే సందర్భంలో రేబాల పట్టాభిరామరెడ్డిగారికి చెందిన ప్లాట్లను కూడా వేలం ద్వారా విక్రయించారు. (ఆ తర్వాతిరోజుల్లో పట్టాభిరామిరెడ్డి కుటుంబసభ్యులు తమకు వేలంద్వారా వచ్చిన మొత్తాన్ని కూడా కస్తూరిదేవి విద్యాలయం అభివృద్ధి కోసమే విరాళంగా అందజేసినట్లు పలు సందర్భాల్లో రేబాల దశరధ రామిరెడ్డిగారు చెప్పడం ఇక్కడ గమనార్హం). ఆ తర్వాత అందరి కృషిమేరకు, ఆశించిన రీతిలో 1944 జులై 16న మళ్ళీ పాఠశాల ప్రారంభమైంది. ఈసారి ఇది హయ్యర్ సెకండరీగ్రేడ్ స్కూల్‌గా ప్రారంభమైంది. అప్పట్లో ఈ కమిటీకి ప్రెసిడెంట్‌గా ఉన్న తిక్కవరపు రామిరెడ్డిగారు ఎంతో గొప్ప వదాన్యులు, సమాజసేవాపరాయణులు కనుక, అప్పట్లోనే ఈ పాఠశాలకు ఉదారంగా 50 వేల రూపాయలు విరాళం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. అప్పటి కథనంతా స్వయంగా నాటి కమిటీ అధ్యక్షుడే ఒక నివేదికలో ఈ క్రింది విధంగా స్పష్టం చేసి ఉన్నారు.. చూడండి!...

### అధ్యక్షుని నివేదికలో ఉన్న నాటి చారిత్రక వివరాలు ఇవీ...

శ్రీమతి పొణకా కనకమ్మ నేతృత్వంలో స్వాతంత్ర్య సమర యోధులు కొంతమంది ఒక బృందంగా ఏర్పడ్డారు. బాలికల విద్య కోసం ఒక జాతీయ విద్యాలయం స్థాపించాలని సంకల్పించారు. అందుకు నెల్లూరు నగరంలో ప్రజల నుంచి చందాల రూపంలో నిధులు సేకరించి పాఠశాలను స్థాపించాలని సంకల్పించి, ఆ పాఠశాలకు మహాత్మాగాంధీజీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిపించారు. ఆ తర్వాత స్వాతంత్ర్యోద్యమంలో వీరిలో అనేకమంది జైలు పాలుకావడంతో ఆ పాఠశాల మూతపడింది. ఆ తర్వాత రాజకీయ వాతావరణంలో మార్పులు రావడంతో తిరిగి వారంతా కలసి తిరిగి పాఠశాలను పునః ప్రారంభించాలనుకున్నారు. ఈసారి ఆ పాఠశా లను హైస్కూలుగా ప్రారంభించారు. అందుకు పట్టణ ప్రముఖులైన రేబాల పట్టాభిరామరెడ్డి సాయాన్ని కోరారు. అప్పుడు ఆయన తమకున్న స్థలాన్ని భవన నిర్మాణాలకు ఇచ్చారు. ఆ స్థలంలోని ఒక పాత భవనంలో 1944లో హైస్కూలు ప్రారంభమైంది.

అప్పట్లో ఈ స్కూల్‌లో 51 మంది బాలికలు విద్యను అభ్యసిస్తుండేవారు. ఇక్కడ చదువుకునేందుకు వచ్చే దూరప్రాంతాలు, ఇతర గ్రామాల నుంచి వచ్చే బాలికల కోసం ఒక హాస్టల్ భవనాన్ని కూడా ప్రారంభించారు. జాతీయభావాలతో ఈ పాఠశాల నడిచేది. ఎందరో బాలికలకు విద్యానిలయంగా ఉండేది. హిందీ, సంస్కృత భాషలు కూడా ఇక్కడ బోధించేవారు. పాఠశాలకు వచ్చే విద్యార్థినుల సంఖ్య క్రమేణా పెరుగుతుండడంతో విద్యాలయం కోసం స్కూలుకు, వసతి గృహానికి పక్కా భవనాల నిర్మాణం అత్యవసరమైంది. ప్రజల నుంచి వచ్చే చందాలు, విరాళాలు, ఎం.ఎస్.సుబ్బులక్ష్మి వంటి ప్రఖ్యాత సంగీతజ్ఞులచే ప్రదర్శితమయ్యే ఉచిత సంగీత కార్యక్రమాల ఏర్పాటు ద్వారా వచ్చే మొత్తాలు, ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్ వగైరాలతో తొలుత స్కూలుకు గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణాన్ని పూర్తిగావించారు. అదేవిధంగా బాలికలు వసతి కోసం నూతనంగా హాస్టల్ భవనం నిర్మించారు.

హాస్టల్ భవనం మొదటి అంతస్తు నిర్మాణం కోసం ప్రముఖ వదాన్యురాలు దివంగత రేబాల పట్టాభిరామరెడ్డి సతీమణి రేబాల సుజాతమ్మ గారు అప్పట్లో 30,400రూపాయలను విరాళంగా ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

(మిగతా కథ వచ్చే వారం)




***శ్రీ కస్తూరిదేవి విద్యాలయం మహిళల చదువు కోసం ఏర్పడిన సరస్వతీ నిలయం. ఎందరో మేధావులు, మహనీయులు, త్యాగధనులు తమ జీవితాల్ని ఈ సంస్థ అభివృద్ధి కోసం అంకితం చేసి భావితరాలకు ఈ సంస్థను ఓ ఆశాదీపంలా అందించారు. అయితే ఇన్నాళ్ళకు ఈ సంస్థ ప్రగతిపథంలో పయనించడానికి బంగారు బాటలు వేసుకుంటున్న తరుణంలో అభూత కల్పనలు, అవాస్తవ కథనాలతో ఓ పాతపేపర్ ఈ కమిటీపై బురద చల్లుతోంది. పత్రికలు ప్రజలను చైతన్యపరచి వాస్తవాలను వారి ముంగిళ్ళలో అక్షరసత్యాలుగా ఆవిష్కరించాలే తప్పితే, తమ స్వార్ధ ప్రయోజనాల కోసం తప్పుడు వార్తలతో, నిరాధార ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం దారుణం, క్షమించరాని నేరం. 1945లో అప్పటి కమిటి ఆధ్వర్యంలో పొగతోటలోని కాసుఖేలవారి అగ్రహారంలోని సుమారు రెండున్నర ఎకరాల భూమిని వేలం వేయటంలో ప్రధాన పాత్ర పోషించింది ఈ పాత పేపరే! 1980లో ఇంత భూమి విద్యాలయాలకు అనవసరం అంటూ 21ఎకరాల విస్తీర్ణంలోని 3ఎకరాలను ప్రైవేట్ వ్యక్తులకు లీజు పేరుతో దారాధత్తం చేసి అక్కడ సినిమాహాళ్ళు నిర్మించడానికి అనుమతులు ఇప్పించే ప్రక్రియలో ఆనాటి కమిటీలో ఒకడిగా ఉండి ఆమోదించి సంతకం పెట్టిందీ ఈ పాతపేపరు అప్పటి సారధే! ఇప్పుడు మొత్తం మిగిలిన భూమినంతా అమ్మేసి దొరికిన మేరకు దోచుకోవడమే పనిగా వారసత్వం పేరుతో ముందుకు వచ్చిన వారిని వెనుకుండి నడిపిస్తున్నది కూడా ఆ పాతపేపరు ఇప్పటి సంపాదకుడే!***

***1981లో ఆ పాతపేపరు అండతో జరుగుతుండిన లీజు వ్యవహారాన్ని, దాంతోపాటు సినిమాహాళ్ళ నిర్మాణాన్నీ అడ్డుకుని కస్తూరిదేవి ఆస్తులను కాపాడేందుకు గునుపాటి హరిశ్చంద్రారెడ్డి, జె.కె.రెడ్డి, పుచ్చలపల్లి బాలకృష్ణారెడ్డి(ఇంగ్లీష్), ఆదాల రాఘవరెడ్డి తదితరులంతా స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సారధ్యంలో 'లాయర్' పత్రికను వేదికగా చేసుకుని ఉద్యమించారు. నాటికి, నేటికి, ఏనాటికీ కూడా కస్తూరిదేవి సంస్థను, సంస్థ ఆస్తులను పరిరక్షించడమే ధ్యేయంగా పత్రిక వ్యవస్థాపకుడి ఆశయమే లక్ష్యంగా పనిచేస్తుంది మా(మీ) 'లాయర్'.***

***ఇప్పుడు మళ్ళీ ఆ సంస్థ పురోగతిని అడ్డుకుంటూ అర్ధంలేని రాతలతో అనవసర రాద్ధాంతం చేస్తూ అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్న కమిటి సభ్యులను అభాసుపాలు చేసే ప్రయత్నం చేస్తున్న పాతపేపరు, నీచాతి నీచమైన భాషతో ఆ పేపరు చేస్తున్న వ్యాఖ్యలతో కడుపుమండి మరోసారి కస్తూరిదేవి పరిరక్షణ కోసం పునరంకితమౌతోంది 'లాయర్'***

***అభూత కల్పనలతో, అవాస్తవ కథనాలతో చనిపోయినవారు సైతం తమకు ఫోన్ చేశారంటూ తప్పుడు వార్తలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తూ తాను రాసిందే వేదం, తాను చేసిందే వాదం అన్నట్లుగా పవిత్రమైన సంస్థనీ, క్షణం తీరిక లేకుండా వేలకోట్ల వ్యాపార సామ్రాజ్యంతో నిత్యం తలమునకలై వుండే జి.వి.కె.రెడ్డి, దొడ్ల శేషారెడ్డి, సీబ్రోస్ సుబ్బారెడ్డి వంటి వారు కస్తూరిదేవి అభివృద్ధి కోసం ముందుకు వస్తే... వారిని తన స్వార్ధ ప్రయోజనాల కోసం తన వ్యక్తిగత లబ్ధి కోసం భ్రష్టుపట్టించే ప్రయత్నం చేస్తున్న ఈ పాతపేపరు ప్రస్తుత సంపాదకుడి అసలు స్వరూపం అక్షర సాక్ష్యాలతో అందిస్తోంది మా(మీ) 'లాయర్'.***

# అభూత కల్పనలు.. అబద్ధపు రాతలు!

### అప్పటి నుండి ఇప్పటి దాకా.. రక్షిస్తున్నామంటూ భక్షిస్తున్న ప్రబుద్ధులు వీళ్ళే!

అసలు కస్తూరిదేవి విద్యాసంస్థలకు ఈ పాతపేపరు వ్యవస్థాపకుడికి ఉన్న అనుబంధం భవిష్యత్‌లో రాబోయే కస్తూరిదేవి కథలో మనకు తెలుస్తుంది. పొణకా కనకమ్మకి అండదండగా ఉంటూ తిక్కవరపు రామిరెడ్డికి సంబంధించిన లెక్కా పక్కా చూస్తూ తాను కూడా కమిటీలో సభ్యుడిగా చేరి, 1945లో పొగతోటలోని సుమారు రెండున్నర ఎకరాలను 22ప్లాట్లు చేసి వేలంవేసి అమ్మడంలో తన పాతపేపరును వేదికగా చేసుకుని ఆనాడు సంస్థని నగర నడిబొడ్డు నుండి ఊరి చివరకు మార్చడంలో ఆ పాతపేపరు వ్యవస్థాపకుడిదే ముఖ్యపాత్ర.

మళ్ళీ 1980లో 21 ఎకరాల నుండి మూడు ఎకరాలను వేరుచేసి అప్పటి కమిటి సభ్యులుగా వున్న యడ్లపల్లి వారికి, మేనకూరు వారికి అంటగట్టి వారిని కారణంగా చూపించి, తనకు అత్యంత సన్నిహితంగా వున్న గునుపాటి రామచంద్రారెడ్డి కుటుంబానికి ఒక ఎకరాని ధారదత్తం చేసింది కూడా ఆ పేపరు 1980 నాటి సంపాదకుడే! అయితే, ఆ పాత పేపరు ఇప్పటి సారధి మరోవార్త రాస్తూ... ఆ గలీజు లీజు వ్యవహారానికి తమ పేపరు అప్పటి సంపాదకుడికి సంబంధం లేదని, గునుపాటి రామచంద్రారెడ్డి అప్పుడు కమిటీ సభ్యుడుగా వున్నాడని మరో అబద్ధపు రాత రాసాడు. గునుపాటి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు శ్రీధర్‌రెడ్డి పేరుతో ఎకరా లీజుకు తీసుకున్నాడే తప్ప, ఏనాడూ కూడా రామచంద్రారెడ్డి కమిటి సభ్యుడు కానేకాదు. రామచంద్రారెడ్డి కమిటి సభ్యుడిగా వున్నాడనడం మరో అబద్ధం.

మళ్ళీ తాజాగా నందనారెడ్డి కమిటి సభ్యురాలిగా వచ్చినప్పుడు బెంగుళూరుకు చెందిన బిల్డర్ వేణుంబాక వెంకటకృష్ణారెడ్డిని సభ్యుడిగా తీసుకొచ్చి కస్తూరిదేవి ప్రస్తుత ఆస్తులను అమ్మేసి ఊరు బయట మళ్ళీ మరో వంద ఎకరాలు కొనాలనే ప్రతిపాదన చేస్తూ, అలాకాని పక్షంలో ప్రస్తుతం కస్తూరిదేవి గార్డెన్స్ పేరుతో వున్న 7ఎకరాల స్థలాన్ని కృష్ణారెడ్డికి జాయింట్ డెవలప్‌మెంట్ క్రింద ఇచ్చి అక్కడ కన్వెన్షన్ సెంటర్, హోటల్ మరియు అపార్ట్‌మెంట్స్ కట్టాలని ప్రతిపాదించడం, ఆ ప్రతిపాదనని అప్పటి కమిటి నిరాకరించడం జరిగింది. అయితే, బైలాస్ ప్రకారంగా సభ్యులను తీసుకోవాలి? అని ఈరోజు బల్లగుద్ధి వాదిస్తున్న నందనారెడ్డి మరి ఆరోజు బెంగుళూరుకు చెందిన ఈ బడా బిల్డర్‌ని ఏ ప్రాతిపదికన కమిటి సభ్యుడిగా తీసుకొచ్చిందో... ఇదే విషయాన్ని తన పాత పేపరులో ప్రస్తావించి, ఆమె తప్పు చేసింది అని కూడా వ్రాసిన ఈ పాతపేపరు ప్రస్తుత సంపాదకుడు ఇప్పుడు ఆమెకు ఏ విధంగా మద్దతు పలుకుతున్నాడో సమాధానం చెప్పవలసి వుంది. మరి తప్పు చేసిన ఆమెతో చేతులు కలిపి తానేదో ఉద్ధరిస్తానని ఈయన చెబుతున్న విషయంలో నిజానిజాలేమిటో ప్రజలకే అర్ధమవ్వాలి.! సంస్థలను పరిరక్షిస్తుందెవరో? భక్షించే ప్రయత్నం చుస్తున్నదెవరో? ప్రజలే ఆలోచించుకోవాలి.

జరిగిన, జరుగుతున్న పరిణామాలన్నీ పరిశీలిస్తూ వస్తే, 1945 నుండి 2018 వరకు కస్తూరిదేవి సంస్థల పరిరక్షణ కోసం ఈ పాతపత్రిక పని చేస్తుందా? లేక ఆ సంస్థలను పతనం చేయడమో? లేదంటే స్వాహా చేయడమో లక్ష్యంగా తన ప్రయత్నాలు సాగిస్తుందా? ఈ విషయాలన్నీ విజ్ఞుల విజ్ఞతకే వదిలేస్తున్నాం.

### నిమిషానికో మాట... వారానికో రాత

ముందుగా 600 కోట్ల ఆస్తి అని ఓ వారం, వెంటనే 700 కోట్ల ఆస్తి అని మరో వారం, వారానికో వందకోట్ల లెక్కన కస్తూరిదేవి సంస్థల ఆస్తులను విలువ కడుతూ సంస్థ అభివృద్ధి కోసం కంకణబద్ధులైన వారిని తన నీచపు రాతలతో నిరాధారపు నిందలతో తరిమికొట్టే ప్రయత్నం చేస్తూ, తనకేమీ ఎరుగనట్టు దీపా వెంకట్ ఎందుకు రాలేదు? సీబ్రోస్ సుబ్బారెడ్డి వెనక్కు ఎందుకు వెళ్ళాడు? వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆసక్తి ఎందుకు చూపలేదు? అంటూ అర్ధంలేని ప్రశ్నలతో అందరినీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం ఆ పాతపేపరు సంపాదకుడు ఎందుకు చేస్తున్నాడో? అతనికే తెలియాలి.

జె.వి.రెడ్డి ఈ సంస్థలను ఇన్నాళ్ళూ కంటికి రెప్పలా కాపాడాడంటూ ఓ వారం, సంస్థను కాజేయాలని చూస్తున్నాడని మరో వారం నందనారెడ్డి తప్పులు చేసింది అంటూ ఓ వారం, అదే నందనారెడ్డిని తప్పక కమిటీలోకి తీసుకోవాలంటూ మరో వారం... ఇలా తాను రాసే రాతలకు తానే సమాధానం చెప్పుకోలేని తలతిక్క వ్యవహారాన్ని నడపడానికి పాతపత్రికని వేదిక చేసుకున్నాడీ అభివృద్ధి నిరోధకుడు. సంస్థ అభివృద్ధి కోసం సలహాలివ్వండి అంటూ కొంతమంది ప్రముఖులను ఆహ్వానించి వారితో సమావేశం నిర్వహిస్తే ఆ సమావేశపు కాగితాన్ని పట్టుకుని ఆరోజు సమావేశంలో పాల్గొన్న వాళ్ళంతా ఈరోజు సభ్యులుగా ఎందుకు లేరు? అని ప్రశ్నించడం ఈ సంపాదకుడి తెలివితక్కువ తనానికి అతిపెద్ద నిదర్శనం. తాను పతాక శీర్షికల్లో బురద చల్లితే అది కడుక్కోలేక అందరూ పారిపోతారన్నది ఆయన అపోహ. 2001లో జి.వి.కె.రెడ్డి సంస్థను తన ఫౌండేషన్ పేర లీజుకు తీసుకున్నాడని, ఈ లీజును అడ్డుకోవడం కోసం మనమంతా పోరాటం చేయాలని సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు పంపిస్తున్న ఈ చపలచిత్తం కలిగిన సంపాదకుడు తన పేపరులోనే ఆ లీజు కొంత మంది అభ్యంతరంతో 2001లోనే రద్దయ్యిందని రాసిన సంగతి మర్చిపోయి మళ్ళీ పిచ్చి ప్రేలాపలనలు పేలడం చూస్తుంటే అతని మానసిక స్థితి ఏ స్థాయిలో వుందో మనం ఊహించుకోవచ్చు.

### మల్లెతోటలు ఖాళీ చేయించిందెవరు?

కస్తూరిదేవి అభివృద్ధి కోసం జి.వి.కె.రెడ్డి చిల్లిగవ్వ కూడా ఖర్చు పెట్టలేదని కారు కూతలు, తప్పుడు రాతలతో రోత పుట్టిస్తున్న ఈ దుష్టుడికి 2001లో జి.వి.కె.రెడ్డి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తక్షణమే మల్లె తోటల పేరుతో బయటవారి కబ్జాలో వున్న 7ఎకరాల కస్తూరిదేవి స్థలాన్ని ఖాళీ చేయించడానికి లక్షలాది రూపాయలు(సుమారు 70లక్షలు) ఖర్చు చేసిన సంగతి ఇతనికి తెలియదా? అప్పటినుండి ఇప్పటి వరకు ప్రతి నెలా సంస్థ సిబ్బందికి జీతాల కోసం ఎప్పుడు అవసరమైతే అప్పుడు నెలకు కనీసం 2లక్షల రూపాయలు తక్కువ లేకుండా చెల్లిస్తున్నది జి.వి.కె.రెడ్డి కాదా? ఒక సంస్థని అభివృద్ధి చేయాలంటే సమర్ధవంతమైన బృందం అవసరం. అందుకోసమే సంస్థని అన్ని విధాలా ప్రగతిపథం వైపు నడిపించే వ్యక్తులను కమిటి సభ్యులుగా తీసుకుంటే ఏదో నేరం జరిగిపోయినట్లు, ఘోరం జరగబోతున్నట్లు పుంఖాను పుంఖాలుగా తప్పుడు కథనాలు రాయడం ఈ సంస్కారహీనుడికే చెల్లింది. ఓ వైపు ప్రభుత్వ ఎయిడ్ వద్దని ట్రస్ట్ లేఖ రాసిందని, మాగుంట పార్వతమ్మని సభ్యురాలిగా తీసేసారని... ఇలా నిరాధారమైన పచ్చి అబద్ధాలను తన పాత పేపరు ద్వారా ప్రజల ముందుంచి ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ఆయన ప్రయత్నానికి వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటో? ఆయన అంతరాత్మకే తెలుసు!

## ఈ విడ్డూరమేమిటి.. చనిపోయినామె ఫోన్ చేయడమేమిటి?

**వెంకటస్వామి సతీమణి కస్తూరిదేవి విద్యార్థినట!**

ఇందిరా గాంధీకి అత్యంత ఆప్తుడు, చివరి శ్వాస వరకు కాంగ్రెస్ సేవకుడిగానే కొనసాగిన పార్టీ విధేయుడు, మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ జి.వెంకటస్వామి సతీమణి డాక్టర్ సావిత్రమ్మ కస్తూరిదేవి విద్యాలయం పూర్వ విద్యార్థినట. ఈ చారిత్రాత్మక పాఠశాల కబ్జాదారుల చెరలో చిక్కుకోవడంపై 'జమీన్‌రైతు' పత్రికలో వచ్చిన వార్తలు చూసిన ఆమె మాకు ఫోన్ చేశారు. నేను చిన్న తనంలో ఈ పాఠశాలలోనే చదివాను. ఆ సమయంలో పొణకా కనకమ్మ గారు పాఠశాల ఆవరణలోనే నివసించే వారు. హాస్టల్‌లో వుండే విద్యార్థినులను పేరు పేరునా పలకరించి, బాగా చదువుకోమని హితబోధ చేసే వారు. ఆమె ఇచ్చిన ప్రేరణ వల్లనే నేను ఆ దినాలలోనే ఉన్నత విద్య అభ్యసించాను. ఆమె స్ఫూర్తి మరవరానిది. అంత గొప్ప మహిళ పట్ల ఇప్పటి వారసుసరిస్తున్న పోకడ నాకు మనస్తాపం కలిగిస్తున్నది. కస్తూరిదేవి అన్యాక్రాంతం కాకుండా చూడడానికి, దానికి పునః వైభవం తేవడానికి, పొణకా కనకమ్మ చేసిన త్యాగాలు చరిత్రలో మాసిపోకుండా కాపాడడానికి నేను చేయగలిగింది ఏదైనా వుంటే చెప్పండి, సంతోషంగా చేస్తాను... అని చెప్పారామె. 82 ఏళ్ల పైబడిన వయస్సులో తాను చిన్నతనంలో చదివిన బడి పట్ల అంత మమకారం కొనసాగించడం చాలా గొప్ప విషయం. పొణకా కనకమ్మ పట్ల ఆమె ప్రదర్శిస్తున్న గౌరవం కూడా గణనీయమైనది. పవిత్రమైన ఉద్దేశాలతో స్థాపించి, నిర్వహించిన సంస్థల విషయంలో మాత్రమే ఈ భావోద్వేగాలు వుంటాయి.

**THE HINDU**

Hyderabad: Congress Working Committee member G. Venkataswamy's wife, Kalavathi,78, died here on Wednesday morning following a prolonged illness. Labour Minister Vinod is one of her two sons.

She was being treated at a corporate hospital in Secunderabad for the last eight months.

Several Congress leaders, including APCC president K. Keshava Rao, Cultural Affairs Minister M. Satyanarayana Rao, and Political Advisor to the Chief Minister, K. V. P. Ramachandra Rao, called on Mr. Venkataswamy at his residence to console the bereaved family.

Chief Minister Y. S. Rajasekhar Reddy, cut short his tour of Telangana districts at Basar and drove from the airport to Mr.

మాజీ కేంద్రమంత్రి, సీనియర్ పార్లమెంటేరియన్ కీ॥శే॥ జి.వెంకటస్వామి సతీమణి డా॥ సావిత్రమ్మ తమకు ఫోన్ చేసిందనీ, కస్తూరిదేవి ఆస్తుల పరిరక్షణలో అవసరమైతే తాను ఎలాంటి సహాయమైనా చేస్తానని చెప్పిందని అంటూ ఆ పాతపేపరు అక్టోబర్26వ తేదీ సంచికలో ఓ వార్తను ప్రచురించింది.


### వాస్తవాలను పరిశీలిస్తే...

అసలు వెంకటస్వామి గారి సతీమణి పేరు సావిత్రమ్మే కాదు, ఆమె పేరు కళావతి. ఆమె 2006 ఏప్రియల్ 26వ తారీఖున తన 78వ యేట తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆమె కుమారుడు వినోద్ కూడా ఖరారు చేశాడు. మరి చనిపోయిన ఆమె ఎక్కడ నుండి వచ్చిందో? మరి ఈ పాతపేపరాయనికి ఎక్కడ నుండి ఫోన్ చేసిందో?? ఆయనకే తెలియాలి! మరణించిన మనిషి ఫోన్ చేయడమేమిటి? ఈయన గారికి ఫోన్ చేసిన ఆ 'మహానటి' సావిత్రమ్మ ఎవరో? ఆ మహానుభావుడుకే తెలియాలి! తన విషపు రాతల కోసం ఒక ప్రముఖురాలి మృతిని కూడా ఉపయోగించుకోవడం ఏమిటి? బ్రతికున్న వారెవరూ ఇతని మాటలు, ఇతని రాతలు నమ్మడం లేదనడానికి ఇదొక ఉదాహరణ. ఆ పాత పేపరులో వచ్చే కథనాలన్నీ ఎంతటి కట్టు కథలో, ఇంకెంతటి దుర్మార్గపు అబద్ధపు రాతలో ఇంత కంటే అక్షర సాక్ష్యం వేరొకటి అవసరమా? ఆమె మరణానికి సంబంధించి ఏప్రియల్ 27, 2006న ది హిందు ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తను మీరే చూడండి!

### ఇవీ ఆయన డిమాండ్లు...

తనను కమిటి సభ్యుడిగా తీసుకోవాలని, తన సమీప బంధువుకు కస్తూరిదేవిలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని, తన ప్రతిభా పాటవాలతో మూలన పడిపోయిన తన టివి ఛానెల్‌ను పదికోట్ల రూపాయలు పెట్టి జి.వి.కె.రెడ్డి కొనుక్కోవాలని, లేదంటే కస్తూరిదేవి అభివృద్ధిని అడ్డుకుంటూనే వుంటానన్నది ఆయన చేసిన ప్రతిజ్ఞ! ఇటీవల కస్తూరిదేవి ప్రాంగణంలో జరుగుతుండిన కమిటి మీటింగ్‌లోకి తన అనుయాయులతో దౌర్జన్యంగా జొరబడి, చట్టవిరుద్ధంగా ప్రవర్తించడం మూర్ఖపు వాదనలు చేయడం, అదే పనిగా కమిటీ సభ్యులపై తప్పుడు కథనాలు రాయడాన్ని మేధావులు ఖండిస్తున్నారు. తన స్వార్ధం కోసం, తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాతపేపరును వేదికగా చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించి చనిపోయిన వాళ్ళు కూడా తమకు ఫోన్ చేశారంటూ నీచాతినీచమైన అబద్దాలను అల్లుతూ తన పబ్బం గడుపుకోవాలని ఆయన చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు. అభివృద్ధి చేసేవాళ్ళ మాట నమ్మాలా? లేక అభివృద్ధి నిరోధకుల తాటతీయాలా? అన్నది ప్రజలే నిర్ణయిస్తారు.

## పాత పేపరు రోత కతలు



## శాస్త్ర విజ్ఞానంలో
# జ్ఞానాన్ని చాటుకున్న డా. కిషోర్స్ రత్నం విద్యార్థులు

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 3 ప్రదర్శనలు



విద్యార్థులను సన్మానిస్తున్న జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు

జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో డా.కిషోర్స్ రత్నం విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా విజ్ఞాన వస్తు ప్రదర్శనశాలలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం టెక్నో స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు డి.వెంకట నితీష్‌చంద్రతేజ, జి.కార్తికేయ ప్రదర్శించిన స్పేర్స్ ఏ స్పాట్, సేవ్ ఏ లాట్, ఆర్.శ్రీనిధి చక్రవర్తి, 8వ తరగతికి చెందిన కెవి సుమయశస్విని ప్రదర్శించిన రోడ్డు ప్రమాదాలు– నివారణ అనే శాస్త్ర ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా వేదాయపాళెం లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు బి.లక్ష్మీలిఖిత, అమృతవర్షిణిలు సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం అనే అంశంపై సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ మూడు ప్రదర్శనలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. వీరంతా డిసెంబర్ 2, 3 తేదీల్లో గుంటూరులోని కెఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించ నున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



## పినాకిని స్విమ్మర్స్ వారిచే..
# సైకత శివయ్యకు పూజలు

నెల్లూరులోని పెన్నానదిలో క్రమం తప్పకుండా ఈతకు వెళ్లే పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రతిఏటా కార్తీక మాసంలో పెన్నానదిలోనే సైకత శివలింగాన్ని ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహిస్తుంటారు. ఈసారి కూడా మొన్న తొలి కార్తీక సోమవారం సందర్భంగా సైకత శివలింగానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పాలు, నెయ్యి, గంధం, కుంకుమ, విభూది, పన్నీరు, కొబ్బరినీళ్ళతో అభిషేకం నిర్వహించారు. పండిత స్వామీజీలు మునీంద్ర, గోపాలకృష్ణ, శేషుబాబు, బుజ్జయ్యలు శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోపూరు పెంచలయ్య, కార్యదర్శి డి.శరత్‌చంద్ర, సత్యం, తాటి వెంకటేశ్వర్లు, మందాకిని రవి, కృష్ణారెడ్డి, శేఖర్, భరత్‌జైన్, చొక్క లింగం తదితరులు పాల్గొన్నారు.

## పండ్లు పంపిణీ చేసిన
# సీనియర్ సిటిజన్లు




నెల్లూరులోని సీనియర్ సిటిజన్లు వృద్ధులకు, రోగులకు పండ్లు పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. నెల్లూరు సిటీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల11న ఈ కార్యక్రమం జరిగింది. అందరూ కలసి నెల్లూరు హాస్పిటల్‌లో ఉన్న రోగులకు, నిరుపేద వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెల్లంచేటి చంద్రమౌళి, కార్యదర్శి వి. మోహన రామయ్య, కోశాధికారి పి.పార్ధసారధి, పి.సత్యరామయ్య, ఎన్.నమశ్శివాయ, సురభి రాజశేఖర్, గడ్డం సుధాకర్‌రెడ్డి, కల్పం శ్రీనివాసులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# సమస్యలు పరిష్కరిస్తా..

### - కొత్త సబ్‌కలెక్టర్ ఆనంద్



గూడూరు కొత్త సబ్‌కలెక్టర్‌గా ఓ.ఆనంద్ నియమితులయ్యారు. ఈనెల 12న గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ట్రైనీగా ఉన్న ఆయన బదిలీపై గూడూరుకు సబ్ కలెక్టర్‌గా వచ్చారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను అభినందిస్తూ పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, డివిజన్‌లో రెవెన్యూ సమస్యలను పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పురపాలక సంఘం కమిషనర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ పటిష్టతకు..
# అబ్దుల్‌కలాం ఆజాద్ కృషి అమోఘం


సభలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

విద్యావ్యవస్థలో పెను మార్పులు తీసుకువచ్చి దేశ విద్యాభివృద్ధికి, విద్యా వ్యవస్థ పటిష్టతకు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చేసిన కృషి నిరుపమానమైదని గూడూరులోని మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభలో వక్తలు కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 131వ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల12న స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహించిన సభలో సంస్థ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా ఉండి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌ను స్థాపించి దేశవ్యాప్తంగా విద్యారంగాన్ని పటిష్టం చేసిన మహనీయుడని అబ్దుల్‌కలాం ఆజాద్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప విద్యాశాఖ అధికారి షేక్ యజ్దాని అహమ్మద్ మాట్లాడుతూ విద్యతో దేశాభివృద్ధి జరుగుతుందని, దేశప్రగతికి విద్యారంగం ఎంతో కీలకమైనదని అన్నారు. తొలుత అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ప్రదానోపాధ్యాయుడు రవూఫ్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.డి ఇస్మాయిల్ ఈ సందర్భంగా చిన్నారులకు పెన్స్, డిక్షనరీలను బహుకరించారు.

# బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తా

## - భవన ప్రారంభోత్సవ సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


బ్రాహ్మణ భవనాన్ని ప్రారంభిస్తున్న విపిఆర్, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రోహిణి


సమావేశంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బ్రాహ్మణులంతా కలిసి సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించడం అభినందనీయమని, కుల మత తారతమ్యాల తేడా లేకుండా బ్రాహ్మణులు తీసుకున్న నిర్ణయం ముదావహమని సేవాభూషణ్, రాజ్యసభసభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. గూడూరులో నిర్మించిన బ్రాహ్మణ భవనం ఆ సామాజిక వర్గానికే కాకుండా ఇతర సామాజిక వర్గాల అవసరాలకు కూడా ఉపయోగపడేలా కమిటీ నిర్ణయం తీసుకోవడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. రెండో పట్టణంలోని వివిఎస్ఆర్ స్కూల్ సమీపంలో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ భవనాన్ని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ ప్రముఖ వైద్యులు సి.జనార్ధన్‌రెడ్డితో కలిసి ఈ నెల 9వ తేదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని బ్రాహ్మణులకు ఈ భవనం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ భవన నిర్మాణానికి తనవంతుగా చేసింది కొంతే నని, ప్రముఖ వైద్యులు సిఆర్‌రెడ్డి ఎంతో తోడ్పాటునందించారని, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రోహిణిలను కొనియాడారు. ఈ భవన నిర్మాణానికి సంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ కృషి ఎంతో గొప్పదన్నారు. కోటి రూపాయలు విలువచేసే ఈ స్థలాన్ని బహుకరించిన ముంగమూరి సీతమ్మ దాతృత్వాన్ని కూడా కీర్తించారు. డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణిలు మాట్లాడుతూ గూడూరులోని రోటరీ స్వర్గధామంలో పార్ధివ భవనాన్ని నిర్మించామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్రాహ్మణ భవనాన్ని సేవా కార్యక్రమాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. సంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు మాట్లాడుతూ 1987లో స్థాపించిన ఈ సంఘం తన తండ్రి యరగుడిపాటి రామారావు ఆశయాలకు తగ్గట్లు ఇన్నేళ్ళకు ఈ భవనాన్ని నిర్మించుకోగలిగామన్నారు. ఈ భవనానికి డాక్టర్ సిఆర్‌రెడ్డి పేర ఆయన అల్లుడు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణిలు రూ. 8లక్షలు అందజేశారన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ. 5 లక్షలు భూరి విరాళాన్ని అందించారన్నారు. 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ దాతల సహకారంతో చక్కటి భవనాన్ని నిర్మించినందుకు కమిటీకి అభినందనలు తెలిపారు.

బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రోహిణిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, కమిటీ సభ్యులు కడివేటి రామమూర్తి, పురుషోత్తం, డి.బి.శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షులు కడివేటి పద్మజ, రాజ్యలక్ష్మి, రాజేశ్వరీదేవి పాల్గొన్నారు. లలితమ్మ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.


వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు


డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, సి.రోహిణిలను సన్మానిస్తున్న సంఘం నాయకులు

# యుపిఏ కబ్జాకు బాబు ప్లాన్

పాతిక ప్రపంచ మేటి నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్ చేసి తీస్తే వచ్చిన అమరావతి నగరం. ఉండవల్లిలోని హైటెక్‌రత్న చంద్రబాబు నివాసం. అప్పుడే ఏపి బ్రాండ్ అంబాసిడర్ 'సూర్య' నిప్పులు కక్కుతూ దూసుకొస్తున్నాడు. చంద్రబాబు అప్పటికే రెడీ అయ్యి హాల్‌లోకి వచ్చాడు. అక్కడ ఎంపీలు సీఎం రమేష్, కేశినేని నాని, గల్లా జయదేవ్, మురళీ మోహన్, శివప్రసాద్, మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, కళా వెంకట్రావ్‌లు వున్నారు. చంద్రబాబు వుండి... కె.ఇ.కృష్ణమూర్తి రాలేదా? అని అడిగాడు. అందుకు సోమిరెడ్డి... ఆయనను హౌస్ అరెస్ట్ చేయించాం సార్, కాంగ్రెస్‌తో టీడీపీ పొత్తు పెట్టుకుంటే ఉరేసుకుంటానని మీ మీద అతినమ్మకంతో గతంలో ఆవేశంగా వాగాడు. ఇప్పుడు ఎక్కడ అలాంటి అఘాయిత్యానికి పాల్పడుతాడోనని హౌస్ అరెస్ట్ చేయించాం. ఆయనను ఉంచిన గదిలో ఉరితాళ్ళు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పాడు. తర్వాత చంద్రబాబే... మన ప్రయాణానికి అంతా సిద్ధమా... అని అడిగాడు. అందుకు సీఎం రమేష్.. వేయడానికి పూలదండలు రెడీ, చేతికివ్వడానికి బొకేలు రెడీ, కప్పడానికి శాలువాలు రెడీ, ఫ్లైట్‌లో ఇంధనం రెడీ, ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ రెడీ... అని చెప్పాడు. అంతే చంద్రబాబు టీమ్ కార్లలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అక్కడ సిద్ధంగా వుంచిన నవయుగ కంపెనీ వారి స్పెషల్ ఫ్లైట్‌లో అందరూ ఎక్కారు. 'అత్తారింటికి దారేది' సినిమాలోని 'గగనపు వీధి...' పాట దూరంగా వినిపిస్తుండగా ఫ్లైట్ గాల్లోకి లేచింది.

★★★★★

కలకత్తాలోని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసం. ఆమె ఇల్లు చాలా సాదాసీదాగా వుంది. ఇంటి బయట లగ్జరీ కార్లు లేవు. ఒక సాధారణ మారుతీకారు మాత్రమే వుంది. చంద్రబాబు బృందం ఆమెతో భేటీ అయ్యింది. చంద్రబాబు ఆమె చేతికి బొకే ఇచ్చి శాలువా కప్పి సత్కరించాడు. తర్వాత ఆయనే... మేడం మనం ఒక కూటమిగా ఏర్పడి ఆ నరేంద్ర మోడీకి బుద్ధి చెప్పాలి. ఇంకో ఐదేళ్ళు అతనే పీఎంగా వుంటే మనలో చాలామందిని జైలుకు పంపిస్తాడు అని అన్నాడు. అందుకు మమత... నిజమే, ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడని నన్నే శారదా, నారద లాంటి చిట్‌ఫండ్ స్కాంలలో ఇరికించాలని చూస్తున్నాడు. అలాంటిది నిన్ను ఇరికించడం మోడీకి పెద్ద లెక్క కాదు. కలిసి పోరాడుదాం అని చెప్పింది. తర్వాత చంద్రబాబే... మేడం, ఇన్నేళ్ళ నుండి సీఎంగా వున్నారు, అప్పటికీ ఇప్పటికీ మీ పరిస్థితేం మారలేదే అని అడిగాడు. వెంటనే సీఎం రమేష్ కల్పించుకుని... ఓ రెండేళ్ళు మమ్మల్ని ఇక్కడ పెట్టండి మేడమ్, ఎలా మార్చేస్తామో చూడండి, మనిషి ఇన్ని రకాలుగా సంపాదించవచ్చా అని మీరే ఆశ్చర్యపోతారు అని అన్నాడు. వారి మాటలకు మమతా నవ్వి వూరుకుంది. చంద్రబాబు బృందం అక్కడనుండి సెలవు తీసుకుని బయలుదేరింది.

★★★★★

ముంబైలోని నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం. ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌తో చంద్రబాబు బృందం భేటీ అయ్యింది. శరద్‌పవార్‌కు చంద్రబాబు పూలదండలేసి శాలువాలు కప్పి సత్కరించాడు. తర్వాత శరద్‌పవార్ వచ్చిన పనేంటని అడిగాడు. మనమందరం కలవాలి. ఒకే తాటిపైన నడవాలి. ఒకే కూటమిగా పోటీ చెయ్యాలి. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ మోడీని ఓడించాలి. మళ్ళీ కూడా మోడీ ప్రధాని అయ్యాడంటే మన అందరికీ కష్ట కాలమే అని చంద్రబాబు చెప్పాడు. అందుకు పవార్... కూటములను ఏర్పాటు చేయడంలో నీకు అనుభవం వుంది. అందరి కాళ్ళు, గడ్డాలు పట్టుకునైనా దారికి తేగల టాలెంట్ మీకే వుంది. కాబట్టి మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆల్‌ది బెస్ట్ అంటూ సాగనంపాడు.

★★★★★

బెంగుళూరులోని మాజీ ప్రధాని దేవేగౌడ నివాసం. మధ్యాహ్నం 3గంటలు. దేవేగౌడ అప్పుడే రాగిసంగటి తిని సోఫాలోనే నడుం వాల్చి గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. కర్నాటక సీఎం కుమారస్వామి ఆ పక్కనే టీవీ చూస్తున్నాడు. అంతలో దేవేగౌడ భుజంపై చెయ్యి పడింది. ఎవడ్రావాడు... బంగారం లాంటి నిద్ర పాడుచేసాడు అంటూ దేవేగౌడ తోక తొక్కిన నాగుపాములా లేచాడు. తీరా అక్కడ చూస్తే చంద్రబాబు. దేవేగౌడ టక్కున నాలిక్కరుచుకుని సారీ బాబు, ఎవరో మా ఇంట్లో పనివాళ్ళను కున్నాను, ఇప్పుడే వస్తున్నారా, సంగటి, మిరపకాయల పచ్చడి చేసుంది తింటారా? తినకపోయినా ఇబ్బంది లేదు లేండి, అయినా మా రాగిసంగటి మీరెక్కడ తింటారులే అని అన్నీ ఆయనే అనేసి... వచ్చిన విషయం ఏంటని అడిగాడు. చంద్రబాబు అందుకు... మోడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టాను, ఆరోజు బ్రిటీష్‌వాళ్ళను తరిమికొట్టడానికి గాంధీజీ ఎలా పోరాడాడో, ఈరోజు మోడీని వెళ్ళగొట్టడానికి నేను కూడా అలా పోరాడుతున్నాను. దీనికి మీ అందరి సహకారం కావాలి అని అన్నాడు. దానికి దేవేగౌడ, కుమారస్వామిలిద్దరు కూడా... దానిదేముంది సార్, మోడీని దించడానికి మీ వెనుకే మేం కూడా కదిలి వస్తామని చెప్పారు. చంద్రబాబు సంతోషంగా అక్కడ నుండి సెలవు తీసుకుని బయటకొచ్చాడు.

★★★★★

చెన్నైలోని డిఎంకె కార్యాలయం. చంద్రబాబు, స్టాలిన్‌లు ఒకర్నొకరు ఆలింగనం చేసుకున్నారు. చంద్రబాబు వుండి... మీ నాన్నగారిని 1996లోనే ప్రధానిని చేద్దామనుకున్నాను, కాని ఆయన ఒప్పుకోలేదు. కాబట్టి అప్పట్లో దేవేగౌడను, తర్వాత ఐ.కె.గుజ్రాల్‌ను ప్రధానులను చేశాను. మొన్న 2014లో మోడీని ప్రధానిని చేసాను, ఇప్పుడు మోడీ నన్నే లెక్క చేయడం లేదు. ఆ మోడీని ఎలాగైనా దించేయాలి తంబి అని అన్నాడు. అందుకు స్టాలిన్... మేమెప్పుడో అందుకు సిద్ధంగా వున్నాం అని చెప్పాడు. తర్వాత చంద్రబాబు మీడియాతో... నా దృష్టిలో మోడీ కంటే స్టాలిన్ గొప్పవాడు అని చెప్పాడు. పక్కనేవున్న రమేష్ బాబు చెవిలో... గతంలో ప్రపంచంలోనే మోడీ గొప్ప నాయకుడని అన్నారు, ఇప్పుడు స్టాలిన్ గొప్ప నాయకుడంటున్నారు, రేపు తేడా రాదా... అని చల్లగా అడిగాడు. అందుకు చంద్రబాబు... అలా తేడా వస్తే.. నేను గొప్పవాడు అన్నది డిఎంకె స్టాలిన్‌ని కాదు, కమ్యూనిస్టు స్టాలిన్‌ను అని కవర్ చేసుకోనూ అని చెప్పాడు. అప్పుడు సీఎం రమేష్... మీ తెలివికి హ్యాట్సాఫ్ సార్ అంటూ సెల్యూట్ చేశాడు.

★★★★★

చంద్రబాబు ఆ తర్వాత లక్నో వెళ్ళి బిఎస్పీ అధినేత్రి మాయావతిని, ఎస్పీ అధినేత ములాయంసింగ్ యాదవ్, కాశ్మీర్ వెళ్ళి నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లాను కలిసి మోడీపై తన యాత్రకు సహకరించాలని కోరాడు. వాళ్లంతా అందుకు సరేనన్నారు.

★★★★★

ఢిల్లీలోని టెన్ జనపథ్... ఆ రోడ్డంతా మూడు రంగుల కాంగ్రెస్ బ్యానర్లపై చంద్రబాబు ఫోటోలు... నరేంద్ర మోడీపై పోరాటానికి కాంగ్రెస్‌తో చేతులు కలపడానికి వస్తున్న చంద్రబాబుకు ఘనస్వాగతం... అంటూ వాటిమీద వ్రాసి వున్నారు. ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరిన చంద్రబాబు బృందం నేరుగా టెన్‌జనపథ్‌కు చేరుకుంది. పనబాక లక్ష్మి, అంబికా సోనిలు చంద్రబాబు బృందానికి మంగళహారతి ఇచ్చి స్వాగతం పలికారు. వి.హెచ్.హనుమంతరావు, మధు యాష్కీలు అందరికీ కాఫీ, టీ, బిస్కెట్లు అందించారు. అంతలో సోనియా, రాహుల్ అక్కడకు వచ్చారు. చంద్రబాబును మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. చంద్రబాబు సోనియాతో... మేడమ్ ఒక చారిత్రాత్మక పోరాటానికి శ్రీకారం చుట్టాను, వారం నుండి అలుపెరుగకుండా దేశమంతా తిరిగి అందర్నీ ఏకం చేశాను. మీరు కూడా సహకరిస్తే ఆ మోడీని ఓడించడం పెద్ద సమస్య కాదు అని చెప్పాడు. అందుకు సోనియా... మీ లక్ష్యం, మా లక్ష్యం ఒక్కటే. మీ పోరాటానికి మేము, మా మిత్రపక్షాల సహకారం ఎప్పుడూ వుంటుంది అని... డియర్ ఫ్రెండ్స్ కమాన్ అని అరచింది. అంతే లోపల నుండి మమతా బెనర్జీ, మాయావతి, స్టాలిన్, కుమారస్వామి, శరద్‌పవార్‌లు చేతుల్లో శాలువాలు, బొకేలతో వచ్చారు. చంద్రబాబును సోనియా వారికి పరిచయం చేస్తూ ఈయనే మన కొత్త మిత్రుడు, ఇకనుండి మనతో కలిసి మోడీపై పోరాడబోతున్నాడు అని చెప్పింది. వాళ్లంతా తమ చేతుల్లో వున్న బొకేలు చంద్రబాబు చేతుల్లో పెట్టి, తమ చేతుల్లో వున్న శాలువాలను చంద్రబాబుకు కప్పారు. చంద్రబాబు బిక్క ముఖం వేసుకుని చూస్తుండగా బొకేలను, శాలువాలను సీఎం రమేష్ ఆయన వద్ద నుండి తన చేతుల్లోకి తీసుకున్నాడు. శాలువాల మీద 'స్వర్ణాంధ్ర సిల్క్ ప్యాలెస్, విజయవాడ', బొకేల మీద 'అమరావతి ఫ్లవర్ డెకరేటర్స్, విజయవాడ' అని స్టిక్కర్లు వున్నాయి. అవి చూసి సీఎం రమేష్ చంద్రబాబుతో... సార్, వీళ్లందరూ మనం ఇచ్చిన బొకేలు, మనం కప్పిన శాలువాలు తిరిగి మనకే కప్పారు సార్, ఇన్ని రాష్ట్రాలు తిరిగి బొక్కేలు, శాలువాలు బొక్కయ్యాయి అని అన్నాడు. అప్పుడు చంద్రబాబు... రమేష్ జీవితంలో ఇలాంటివి ఎన్నో చూసాను... కాంగ్రెస్ నుండి తెలుగు దేశంలోకి వచ్చి ఆ పార్టీని సొంతం చేసుకున్నవాడిని... ఎన్డీఏ నుండి యూపిఏలోకి వచ్చిన నాకు ఈ యూపిఏను కబ్జా చేయడం పెద్ద లెఖ్ఖా? అని ప్రశ్నించాడు. మీకేదైనా సాధ్యమే సార్... ఎలుక దూరే సందిస్తే చాలు... ఏనుగును దూర్చేస్తారని సీఎం రమేష్ మెచ్చుకోలుగా చూశాడు.

## నాటి జ్ఞాపకాలు అపూర్వం

కలిసి మెలసి పాండురంగ వసతిగృహంలో ఉంటూ చదువుకుని దేశ, విదేశాల్లో స్థిరపడిన 97 మంది ఈనెల 11న నెల్లూరు పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజ భవనంలో కలుసుకుని ఆత్మీయ సమావేశాన్ని. వసతి గృహ ఛైర్మన్ తవ్వా రంగయ్య ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. 1970 నుంచి 2017 వరకు చదువుకున్న వారంతా కలిసి ఆనాటి తీపి గుర్తులను జ్ఞప్తికి తెచ్చుకుని సరదాగా గడిపారు. వసతి గృహంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అవసరమైన సామగ్రిని, వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. పాండురంగ అన్నదాన సమాజ పాలకవర్గ అధ్యక్షుడు కొండా ప్రవీణ్ శంకర్, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి బయ్యా ప్రసాద్, బొమ్మిశెట్టి నాగేశ్వరరావు, దగ్గుమాటి మురళీకృష్ణ, నూకల బాలసుబ్రహ్మణ్యం, గుండ్లపల్లి మధుసూదనరావు, పూర్వ విద్యార్థులు తాళ్ళూరు పెద్దమాల్యాద్రి, తాళ్ళూరు చిన్న మాల్యాద్రి, పెసల రాధాకృష్ణ, పేర్ల నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశాఖ నూతన కార్యవర్గం

నెల్లూరు కలెక్టరేట్‌లోని ఏపిఆర్ ఎస్సీ భవనంలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమావేశాన్ని ఈనెల 11న ఏర్పాటు చేశారు. కాంట్రాక్ట్ ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులు, అధ్యక్షుడిగా ప్రదీప్, అసోసియేట్ అధ్యక్షులుగా నజీమున్నీసా, ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీలత, కోశాధికారిగా పల్లవి, ఉపాధ్యక్షులుగా రఫీక్ అహమ్మద్, రాజేష్, చంద్రపాల్, హైమావతి, వాసంతి, సునంద, సంయుక్త కార్యదర్శులుగా ఝాన్సీ, వనమ్మ, సిద్దారెడ్డి, సురేఖలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

## బీజేపీలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది

నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరికి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకే జయరాజ్, రాష్ట్ర కార్యదర్శిగా బి.శ్రీనివాసులును నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం ఈనెల 11 న ఉత్తర్వులు విడుదల చేసింది

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తీర్చాలి



నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల కమిటీ సమావేశం ఈనెల10న నెల్లూరు దత్తాత్రేయ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, ట్రెజరి నుండి రావలసిన కంపల్సరి డిపాజిట్ బకాయిలు, రిటైర్డ్ సమయంలో లాస్ ఆఫ్ బుక్స్ కొరకు తగ్గించబడిన సొమ్ము వాపసు చేయాలని, 1983 వ సంవత్సరం నుండి రావలసిన గ్రూఫ్ ఇన్సూరెన్స్ వాపస్ చేయలని, తిత్లీ తుఫాను బాధితుల సహాయార్థం పెన్షన్ నుండి 2018 నవంబర్ నెలలో రూ.200లు మినహాయించి ముఖ్యమంత్రి సహాయనిధికి జమ చేయాలని కోరుతూ తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు యస్.రవీంద్రరావు, అధ్యక్షులు వి.రంగారెడ్డి, ప్రధానకార్యదర్శి యస్. పెంచలయ్య, ఉపాధ్యక్షులు ఎ. గోవిందరెడ్డి, కె.మల్లిఖార్జునరావు, సంయుక్త కార్యదర్శులు సుబ్బారెడ్డి, సుధాకరాచారి పాల్గొన్నారు.

## పేద బ్రాహ్మణ విద్యార్థులకు చేయూత

పేద బ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థికంగా బాసటగా నిలవాలనే సదుద్దేశ్యంతో పేద బ్రాహ్మణ ఉన్నత విద్యా సహాయక ట్రస్ట్ వారు 2018-19 సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈనెల 13 నుండి 26వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరిస్తున్నారు. స్కాలర్‌షిప్ కోసం డిగ్రీ మొదటి, రెండవ సంవత్సరం, ఇంజినీరింగ్ మొదటి, రెండవ, మూడవ సంవత్సరాలు చదివే విద్యార్థినీవిద్యార్థులు నెల్లూరు బృందావనంలో ఉండే ఎంవి.చలంను సంప్రదించాలని ట్రస్ట్ అధ్యక్షులు యస్‌వియల్ ప్రసాద్, కార్యదర్శి వై.నాగదేవీప్రసాద్, కోశాధికారి బివి సతీష్ తెలిపారు. వివరాలకు 9440164423, 9885199663 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరులోని రైతు డిపో అధినేత వీరిశెట్టి సుధాకర్ - విజయకుమారిల కుమార్తె **రమ్యమాధురి - మహేష్** (కర్నూలు వాస్తవ్యులు చిందుకూరు చిన్నయ్య గాండ్ల - పుణ్యవతిల కుమారుడు)ల వివాహం ఈ నెల 8వ తేదీ నెల్లూరులోని గుడిగంట్ల బాలపీరయ్య కళ్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



గతంలో నెల్లూరుజిల్లాలో ఎస్.ఐగా, సి.ఐగా పలు చోట్ల సేవలందించి, ప్రస్తుతం ఒంగోలు టూటౌన్ సి.ఐగా వున్న నేతల సురేష్‌కుమార్‌రెడ్డి - శ్రీలతల కుమార్తె **డా॥ హర్షిత - భాగ్యరాజ్** (హైదరాబాద్ వాస్తవ్యులు మన్నం దాస్ - కోటేశ్వరమ్మల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 11వ తేదీ ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్‌హాలు నందు జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# మన సంస్కృతిని పరిరక్షించుకోవాలి

## - రైల్వే అడిషనల్ డిజిపి కిషోర్‌కుమార్



రైల్వే డిజిపి కిషోర్‌కుమార్‌ను సత్కరిస్తున్న రాంజీ తదితరులు

మనం ఎంతగా ఎదిగినా, ఎక్కడ ఉన్నా సరే..మన సంస్కృతిని మనం పరిరక్షించుకోవాలని, ప్రతిభను ప్రోత్సహిస్తూ మంచిని పెంచుతూ జీవితం సాగించాలని ఏపి రైల్వే అడిషనల్ డిజిపి కెఆర్ఎం కిషోర్‌కుమార్ అన్నారు.

'కళాకారులు మానవ హృదయనిర్ణేతలంటూ స్థానిక సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని టౌన్‌హాలులో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం అద్భుతంగా జరిగింది. తాను కళాకారునిగా ఉంటూ సాటి కళాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశ్యంతో సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి, ప్రముఖ మెజీషియన్ రాంజీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లోని ప్రతిభావంతులకు పురస్కారాలను అందిస్తున్న రాంజీ అభినందనీయుడని కొనియాడారు.

విఎస్‌యు ఉపకులపతి ఆర్ సుదర్శనరావు మాట్లాడుతూ, మానసిక వత్తిడులను అధిగమించేందుకు ఇలాంటి కళాప్రదర్శనలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అనంతరం రైల్వే అడిషనల్ డిజిపి కిషోర్‌కుమార్, విఎస్‌యు ఉపకులపతి సుదర్శనరావు, హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ సమన్వయకర్త కోట సునీల్‌కుమార్, విఎస్‌యు రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, బుచ్చిరెడ్డిపాళం ఎక్సైజ్ సిఐ పి.ప్రసన్నలక్ష్మి, రాష్ట్ర మహిళా ఆర్థికాభివృద్ధి సంస్థ పూర్వ డైరెక్టర్ మల్లి నిర్మల, న్యాయవాది టి.రమాదేవి, బిల్డర్ విరపు లలితారామ్, చెన్నై హాస్పిటల్స్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ ఛైర్మెన్ ఎస్‌వి రమేష్‌బాబు, ఉదయగిరి నరసింహులుగౌడ్, మన్నెమేల గోవిందరెడ్డి, రైతుబాంధవుడు నెల్లూరు గోపాల్‌రెడ్డి, 'హైదరాబాద్ లైటింగ్' షేక్ రియాజ్, డాన్స్‌మాస్టర్లు చిట్టిబాబు, నారాయణమూర్తి తదితరులను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు.

ప్రపంచ తెలుగుసమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, నున్నా శ్రీనివాసులునాయుడు, ఎంఆర్‌పిఎస్ నాయకులు జన్ని రమణయ్య, రఘురామ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత లావణ్య, గీత, చందన తదితరులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు అందరినీ అలరించాయి.

# నింగి కెగసింది.. నేల మురిసింది

(మొదటి పేజీ తరువాయి)



షార్‌లోని సెకండ్ లాంచ్‌ప్యాడ్ నుండి ప్రయోగించిన జిఎస్ఎల్‌వి మార్‌3-డి2 విజయవంతమైంది. 16.43 నిముషాల వ్యవధిలో 3423 కిలోల బరువు గల భారీ జీశాట్-29 ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం విజయవంతంతో ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేవు. ఎందుకంటే జిఎస్ఎల్‌వి సిరీస్‌లో ఇది చాలా కీలక ప్రయోగం. భవిష్యత్‌లో చంద్రయాన్-2, మానవ సహిత అంతరిక్ష యానంపై ఇస్రో చేయబోయే ప్రయోగాలకు ఈ ప్రయోగం పునాది వంటిది. కాబట్టి ఇది విజయవంతం కావడం ఇస్రో అంతరిక్ష చరిత్రలో ఓ కీలక మలుపనే చెప్పాలి. ఈ ఉపగ్రహం ద్వారా ఇండియాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రయోగాన్ని ఇస్రో ఛైర్మెన్ శివన్ పర్యవేక్షించారు. ప్రధాని మోడీ ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు.

# అసలు కథ తేల్చండి!

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు సంస్థకు అప్పగించాలని కోరారు. సిఎం, డిజిపిల ప్రెస్‌మీట్ క్లిప్పింగ్‌లు చూపిస్తే ఎలాంటి వారికైనా ఈ కేసును స్వతంత్ర దర్యాప్తు సంస్థకే అప్పగించాలనుకుంటారు. కాబట్టి కేంద్రం కూడా ఈ కేసు విషయంలో వైసిపి నేతల అభిప్రాయానికే విలువనిచ్చే అవకాశముంది.

జగన్‌పై జరిగింది ఏదో ఆకతాయి దాడో, పబ్లిసిటీ డ్రామానో కాదు. ఖచ్చితంగా అతనిని మట్టుపెట్టే కుట్రే! ఇంత దుస్సాహసానికి పాల్పడాల్సిన అవసరం నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావుకు లేదు. అతనికి జీవితమే మారిపోయే ఆఫర్‌లు వచ్చి వుండొచ్చు. అదృశ్య శక్తులే దీనికి వ్యూహరచన చేసి వుండొచ్చు. కేవలం భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని, అతను సీఎం అయితే రాష్ట్రంలో తమకు మనుగడ కష్టమనుకున్న వాళ్ళే ఈ దుస్సాహసానికి ఒడిగట్టారనే అనుమానాలున్నాయి. సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగితేనే కాని ఈ కేసులో దాగున్న నిజాలు బయటకు రావు.

# పరిణితి చూపాడు.. ప్రశంసలు పొందాడు

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌పై హత్యాయత్నం కేసులో ఈ సందేహాలన్నీ పక్కన పెడితే, సంఘటన జరిగిన తర్వాత ప్రధాన పార్టీల అధినేతలుగా దీనిపై జగన్, చంద్రబాబులు స్పందించిన తీరు వారి మనస్తత్వాలకు, వ్యక్తిగత హుందాతనానికి అద్దం పట్టింది. ఈ సంఘటన జరిగిన తర్వాత నాలుగు పదులు నిండిన వయసులో ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో హుందాగా వ్యవహరించి రాష్ట్రంలోని మేధావులు, తటస్థుల ప్రశంసలు పొందాడు. అదే సమయంలో ఎంతో బాధ్యతాయుతమైన పదవిలో వున్న చంద్రబాబు ఈ సంఘటనపై లేకి మాటలు, వెకిలి చేష్టలతో సీఎం పోస్టుకున్న విలువనే దిగజార్చాడు.

విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్‌పై హత్యాయత్నం జరిగింది. ఆరోజు జగన్ స్థానంలో చంద్రబాబే వుండుంటే చేతికి కట్టు కట్టించుకుని దీనిపై పెద్ద రాద్ధాంతం చేసుండేవాడు. విశాఖ మెయిన్‌రోడ్డులోనే దీక్షలు గట్రా చేసి సానుభూతికి పాకులాడి వుండేవాడు. దీనిద్వారా రాజకీయ లబ్ది పొందేందుకు నానా ఆగిత్యం చేసుండేవాడు.

జగన్ అలా ప్రవర్తించ లేదు. తనపై దాడి జరిగాక ఆవేశంగా కూడా ప్రవర్తించలేదు. నిందితుడిని చట్టబద్ధంగా పోలీసులకు అప్పగించడానికే ప్రాధాన్యతనిచ్చాడు. తాను విశాఖలోనే వుంటే జనం గుమికూడి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతాయని భావించి గాయంతోనే నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే హైదరాబాద్ వెళ్లిపోయాడు. తనకు ఏమీ కాలేదని, కార్యకర్తలు ఆందోళనపడాల్సిన పనిలేదని సంఘటన జరిగిన వెంటనే స్పందించి సందేశమివ్వడం ద్వారా రాష్ట్రంలో హింసాయుత వాతావరణం ఏర్పడకుండా చేశాడు.

ఈ సంఘటన తర్వాత జగన్ చూపిన సమయస్ఫూర్తి, బుద్ధికుశలత అతనిని మరింత మంది ప్రజల మనసులకు చేరువచేసింది. 2014 ఎన్నికల్లో జగన్‌కు అనుభవం లేదు, రాజకీయ పరిణితి లేదు అని ఆయనను వ్యతిరేకించిన తటస్థులు, మేధావులు కూడా ఇప్పుడు జగన్‌ను పూర్తి పరిణితి వున్న నాయకుడుగా, 40ఏళ్ళ అనుభవం వున్న చంద్రబాబు కంటే కూడా మంచి నాయకుడిగా భావిస్తున్నారు. జగన్ పట్ల అభిమానాన్ని పెంచుకుంటున్నారు.

## కాలధర్మం


# పులి స్వరూపరెడ్డి



ఇటు నెల్లూరులోనూ అటు చెన్నైలోనూ ప్రముఖ ఆడిటర్‌గా పేరుపొందిన పులి అశోక్‌రెడ్డి సతీమణి శ్రీమతి పులి స్వరూపరెడ్డి తన 52వ యేట నవంబర్ 10వ తేదీ కన్ను మూశారు. గత కొంతకాలంగా ఆమె తీవ్ర అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందతూ అక్కడే తుదిశ్వాస విడిచారు. మాగుంటోళ్ళ ఆడిటర్‌గా నెల్లూరీయులకు సుపరిచితుడైన కీ॥శే॥ ఆడిటర్ సుబ్బారెడ్డి-నవనీతమ్మల కుమార్తె స్వరూప 1988లో అశోక్‌రెడ్డిని వివాహం చేసుకుంది. వీరికి శ్రీచరణ్, శ్రీస్ఫూర్తి ఇద్దరు పిల్లలు.

స్వరూపరెడ్డి సౌమ్యురాలు, మృధుస్వభావి. ఆమెకు వృద్ధులంటే చాలా ఇష్టం. పెద్దలంటే అమిత గౌరవం. బిడ్డలుండీ అనాథలైన తల్లిదండ్రుల కోసం, బిడ్డలు లేక అభాగ్యులైన వృద్ధుల కోసం ఓ వృద్ధాశ్రమాన్ని స్థాపించాలన్నది ఆమె కోరిక. ఈ విషయమే తరచూ తన భర్త పిల్లల దగ్గర చెప్తూ వుండేదట. భగవంతుడు ఆమె కోరిక తీర్చకుండానే ఆమె బిడ్డలను అమ్మలేని వాళ్ళుగా చేసేశాడు. చిన్నవయస్సులో తల్లిని కోల్పోయిన చిన్నారులకు, భార్యను దూరం చేసుకున్న అశోక్‌రెడ్డికి ఆయన ఇతర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## పేదరికాన్ని తన్ని తరిమేది..
# మన చంద్రబాబే..!




**- ఆదాల ప్రభాకర్‌రెడ్డి**

రాష్ట్రం నుండి పేదరికాన్ని తన్ని తరిమేయగల సత్తా వున్న నాయకుడు మన చంద్రబాబేనని మాజీమంత్రి, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అంటున్నాడు. 12వ తేదీ ఆత్మకూరులో జరిగిన ఆదరణ పథకం క్రింద పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో కలిసి పాల్గొన్నాడు. వారి ద్దరూ కలిసి లబ్దిదారులకు చెక్కులు, పనిముట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ గతంలో పేదవాళ్ల కోసం పనికి ఆహార పథకం వుండేదని, మధ్యలో దానిని తీసేసారని, మళ్ళీ ఆ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలను ఆదుకున్నది చంద్రబాబేనన్నాడు. ఆదరణ పథకం క్రింద జిల్లాలో 10కోట్ల రూపాయల పనిముట్లను పంపిణీ చేస్తున్నామని, ఒక్క ఆత్మకూరు డివిజన్‌కే కోటి 60లక్షల రూపాయల పనిముట్లు పంపిణీ చేస్తున్నామన్నాడు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం జరిగిందని, కృష్ణతో పెన్నానదిని కూడా అనుసంధానం చేయనున్నారని, ఈ ఏడాది జిల్లాలో వర్షాలు లేకపోయినా సోమశిలకు 40టీఎంసీలు నీళ్లు తెచ్చుకున్నామంటే అదంతా చంద్రబాబు పుణ్యమేనని చెప్పాడు. ఆత్మకూరులో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆదాల తెలిపాడు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.గిరినాయుడు, ఇందూరు వెంకట రమణారెడ్డి, రాపూరు సుందరరామిరెడ్డి, ఖాజావలి, రాగి వనమ్మ, చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, నరసింహారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## తక్కువ కాలంలో...
# ఎక్కువ అభివృద్ధి


● తండ్రి చేసిన పనులను వివరిస్తున్న తనయుడు

సర్వేపల్లి నియోజకవర్గంలో అతితక్కువ కాలంలో అతిఎక్కువగా అభివృద్ధి పనులు చేసిన ఘనత మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిదేనని సర్వేపల్లి టిడిపి ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చాడు. సర్వేపల్లి రాజకీయాలలో చురుకుగా పాల్గొంటూ, తన తండ్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కంటే కూడా సర్వేపల్లి ప్రజలకు ఎక్కువగా అందుబాటులో ఉంటూ తన తండ్రికి చేదోడువాదోడుగా నిలుస్తున్న రాజగోపాలరెడ్డి తన తండ్రి చేస్తున్న మంచిపనులను సర్వేపల్లి ప్రజలకు వివరించే ప్రయత్నంలో భాగంగా 12వ తేదీన పొదలకూరులోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టాడు. పొదలకూరులో 4.60కోట్లతో చేపట్టిన మెగా వాటర్ ప్లాంట్ పనులు మరో వారంలో ప్రారంభం కాబోతున్నాయి. కండలేరు ఎత్తిపోతలను అందుబాటులోకి తేవడంతో సోమశిల దక్షిణ కాలువ నీళ్ళను పొదలకూరు మండలానికి తేవడమేకాక పెండింగ్ పనులు కూడా పూర్తి చేస్తున్నారు. మనుబోలు మండలం రైతుల చిరకాల వాంఛ అయిన దేగపూడి-బందేపల్లి కాలువ పనులు కూడా త్వరలో సాకారం కాబోతున్నాయి. ఎన్నికలలో ఓడిపోయినా కూడా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి అభివృద్ధి కోసం ప్రతిక్షణం తపనపడుతున్నారు. అలాంటి అభివృద్ధి సారధిని వచ్చే ఎన్నికల్లో సర్వేపల్లి ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలంటూ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి పిలుపునిచ్చాడు.

# గోపాల్‌రెడ్డి గొప్ప గురువు

**------------------ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు కళాశాల ఛైర్మెన్ స్వర్గీయ డా.ఐ.గోపాల్‌రెడ్డి చేసిన సేవలు అమూల్యమైనవని కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల కళాశాలలో జరిగిన 66వ గవర్నింగ్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, కళాశాలకు గోపాల్‌రెడ్డి చేసిన సేవలు అమోఘమని, గత నెలలో ఆయన స్వర్గస్తులయ్యారని, ఆయన మృతి తమకెంతో బాధాకరమని అన్నారు. కళాశాలలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను, ఇంతవరకు జరిగిన అభివృద్ధిని సమీక్షించి ఆయన తన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి పూర్వ యుపిఎస్‌సి మెంబర్ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షత వహించారు. యుజిసి నియమించిన సభ్యుడు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ దూబె, కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని కళాశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు.

# రంగంలోకి మహిళా రక్షక్‌లు

మహిళల మాన, ప్రాణ రక్షణకు మహిళా రక్షక్ టీంలను అందుబాటులోకి తెచ్చారు జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి. మహిళలపై జరుగుతున్న నేరాలు, దాడులను నివారించేందుకు 10 రక్షక్ బృందాలను ఏర్పాటు చేసారు. ఈ మేరకు ఈనెల 13న బృందాలకు జెండా వూపి ప్రారంభించిన అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏడాది మహిళలపై హత్యలు, లైంగిక దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని మహిళలకు రక్షణ కల్పించేందుకు మహిళా రక్షక్ టీంలను అందుబాటులోకి తెచ్చామన్నారు. నగరంలో వీటిని నియమించామని మహిళా డీఎస్పీ పి. శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ బృందాలు పనిచేస్తాయన్నారు. ఒక్కో బృందంలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషుల పోలీస్ సిబ్బంది ఉంటారని, వీరు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో మహిళలపై వేధింపులు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి మఫ్టీలో తిరుగుతుంటారని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలిపేందుకు 100 నంబరుకు డయల్ చేయాలని, లేదా 93907 77727, 94904 3956 నంబర్లకు ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా సమాచారం అందజేయొచ్చని తెలిపారు.


మహిళా రక్షక్ బృందాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రస్తోగి

## రోటరీ హెల్పేజ్ ద్వారా..
# వృద్ధులకు ఫలసరుకులు



ఫలసరుకులు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

గూడూరులోని రోటరీ హెల్పేజ్ ద్వారా ఇటీవల నిరుపేద వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. స్థానిక రోటరీ భవన్‌లో రాజినేని రామానాయుడు ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ హెల్పేజ్ ద్వారా పేదలను ఆదుకోవడం సంతోషంగా ఉందని, పేదలకు ఆసరాగా రోటరీ హెల్పేజ్ సేవలు అభినందనీయని, రోటరీ క్లబ్‌ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు జానకిరామిరెడ్డి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రాజు, రఘురామిరెడ్డి, హనుమంతరావు, మల్లయ్య, మనోహర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రమణబాబు, నాగేంద్రప్రసాద్, జయరామయ్య, శ్రీధర్‌నాయుడు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ యుద్ధంలో...

# భారత సైన్యం సేవలు అజరామరం

### ఫ్రాన్స్‌లో జరిగిన ప్రపంచ యుద్ధవీరుల సంస్మరణ సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో కరచాలనం చేస్తున్న వెంకయ్యనాయుడు



పారిస్‌లోని యుద్ధ స్మారకం వద్ద వివిధ దేశాధినేతలతో వెంకయ్యనాయుడు

శాంతిస్థాపన కోసం మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన యుద్ధ వీరులకు ప్రపంచదేశాలు ఈనెల 11న కన్నీటి నివాళులర్పించాయి. నాలుగేళ్ళపాటు కొనసాగి 1.8కోట్ల మంది ప్రాణాలను బలిగొన్న మొదటి ప్రపంచ యుద్ధం విరమణకు ఈ నెల 11వ తేది నాటికి వందేళ్ళు పూర్తయాయి. 1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచయుద్ధం 1918 నవబంరు 11న ముగిసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని శాంప్స్-ఎల్లీస్‌లో ఆ దేశాధ్యక్షుడైన ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సారధ్యంలో ప్రపంచ యుద్ధవీరుల సంస్మరణ వేడుకలు భారీగా జరిగాయి. పారిస్‌లోని యుద్ధస్మారకం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ దేశాల నేతలు యుద్ధవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రపంచయుద్ధంలో భారత సైన్యం సేవలు అజరామరమని కొనియాడారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్, కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో, ఇంగ్లండ్ రాణి క్వీన్ ఎలిజబెత్ -2, ప్రధాని థెరిస్సా మేతో పాటు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సహా 70 దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కరచాలనం చేశారు. అనంతరం, యుద్ధస్మారకస్తూపం వద్ద నేతలందరూ నిలచి 'ప్రపంచశాంతి కోసం యుద్ధాలను అణచివేయాలంటూ' పిలుపునిచ్చారు.



పారిస్‌లోని ఎలిసీ భవనం వద్ద ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ దంపతులతో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు

#### భారత సైనికులు స్వేచ్ఛా, శాంతి యోధులు...

మొదటి ప్రపంచ యుద్ధంలో ఫ్రాన్స్ తరఫున పోరాడిన భారత సైనికులు స్వేచ్ఛా, శాంతి యోధులని భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు కొనియాడారు. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి పారిస్‌లో నిర్వహించిన ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రసంగించారు. మొదటి ప్రపంచయుద్ధంలో అత్యంత ధైర్యసాహసాలతో భారతీయ సైనికులు ఫ్రాన్స్ తరఫున ప్రాణాలకు తెగించి పోరాడారని, ఆ యుద్ధంలో వేలాదిమంది భారతీయ సైనికులు ప్రాణాలు కోల్పోయారని ఆయన అన్నారు. వారి జ్ఞాపకార్థం ఫ్రాన్స్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న విల్లర్స్ గుస్లైన్‌లో నిర్మించిన, మొదటి ప్రపంచయుద్ధంలో అసువులు బాసిన భారత సాయుధ దళాల స్మారకస్తూపాన్ని ఉపరాష్ట్రపతి ఈ నెల 11న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, సరిగ్గా నూరేళ్ళ క్రితం నాటి ఆ యుద్ధకాలంలో...శరీరం గడ్డకట్టే శీతాకాలంలో ఫ్రాన్స్‌కు వచ్చిన భారత సైనికులు కనీసం ప్రత్యేక దుస్తులు కూడా లేకుండానే ఫ్రాన్స్ తరఫున పోరాడి ప్రాణాలు అర్పించారన్నారు. ఈ మట్టిలో భారతీయుల రక్తం ఉందని, శతాబ్దం క్రితమే భారతీయ వీర సైనికుల ధైర్యసాహసాలకు ఫ్రాన్స్ సాక్ష్యంగా నిలిచిందని అన్నారు. దాదాపు లక్షా 40వేల మంది భారతీయ సైనికులు నాటి మొదటి ప్రపంచయుద్ధంలో ఫ్రాన్స్ తరఫున పోరాడాన్నారు. ఫ్రాన్స్ రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో భారతీయులు కీలక పాత్ర పోషిస్తుండడం పట్ల ఉపరాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. శాంతి, అహింసల కోసం భారత్ ఎప్పుడూ ముందు వరుసలో నిలుస్తుందని, భారత్-ఫ్రాన్స్ పట్టణీకరణ, రవాణా రంగాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయని, భారత్ ఆర్థిక వృద్ధిలో భాగస్వాములయ్యేందుకు అందరినీ ఆహ్వానిస్తున్నామని అన్నారు. ప్రవాస భారతీయులు తమ స్వదేశమైన భారత్‌లోను, ప్రస్తుతం ఉంటున్న ఫ్రాన్స్ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. స్మారకస్తూపం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన ఫ్రాన్స్ ప్రభుత్వానికి భారత ప్రభుత్వం తరఫున ఉపరాష్ట్రపతి కృతజ్ఞతలు తెలిపారు. మొదటి ప్రపంచ యుద్ధంలో భారతసైన్యం వీరత్వంపై జార్జ్ మోర్టాన్ జాక్ రచించిన పుస్తకాన్ని, ఫ్రాన్స్‌లో భారతవీరుల స్మారక చిహ్నాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ పర్యటన తన జీవితంలో మరువరానిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంట ఆయన సతీమణి ఉషానాయుడు, భారత ఫ్రాన్స్ రాయబారి వినయ్‌మోహన్ క్వత్రా తదితరులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## విఆర్‌సి పాలకవర్గ ఎన్నికల ప్రక్రియకు పచ్చజెండా!

విఆర్ విద్యాసంస్థల పాలకవర్గం ఎన్నిక కోసం ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలైంది. జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు విఆర్ విద్యా సంస్థల ప్రత్యేక అధికారిగా వున్న కుమారి వెట్రిసెల్వి దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. విఆర్ విద్యాసంస్థల్లో భాగమైన విఆర్ హైస్కూల్, విఆర్ ఇంటర్, డిగ్రీ కాలేజీ, విఆర్ న్యాయ కళాశాల, విఆర్ ఐఏఎస్, విఆర్ ఐపిఎస్, విఆర్ బిఇడి, విఆర్ డిఎడ్ కళాశాలల్లో 2016లోపు ఎప్పుడైనా ఒక అకడమిక్ సంవత్సరం మించి చదువుకున్నోళ్ళు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ నెల 14వ తేదీన మొదలైన ఓటర్ల నమోదు కార్యక్రమం డిసెంబర్ 13వ తేదీ వరకు ఉంటుంది. ఈ కేంద్రంలో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 5రూపాయల రుసుముతో ఓటు నమోదు చేసుకోవచ్చు. విఆర్ విద్యాసంస్థలలో చదివిన పూర్వవిద్యార్థులందరికీ ఇదో చక్కని అవకాశం. కాబట్టి విఆర్ పూర్వవిద్యార్థులు ఓటర్లుగా నమోదు కావడంపై దృష్టి సారించాల్సివుంది.



వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసును స్వతంత్ర్య దర్యాప్తు సంస్థ చేత విచారణ జరిపించాలని కోరుతూ ఈ నెల 13వ తేదీన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, వి.వరప్రసాద్, వై.యస్.అవినాష్‌రెడ్డి.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com